epaper. aksharakalam. com


# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com


సంపుటి : 19 సంచిక : 53 | 03-05-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00




## సర్వోదయ తెలంగాణ కోసం

# పాంచజన్యం పూరించాం



- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత

తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు.

వివరాలు 2లో..



## హోర్ముజ్ జల సంధిపై కొత్త నియమాలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది.

2



## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

2



## సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు

సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

2



లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన ప్రదర్శనను ప్రారంభించిన అమిత్ షా



## సిరిసిల్ల వాసుల మృతిపై కేటీఆర్ సంతాపం

### ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి

శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

వార్త 2లో

### రైతు సమస్యల పరిష్కారంలో

## కాంగ్రెస్ విఫలం

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

**సిద్దిపేట, అక్షరకలం ప్రతినిధి**



రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కొనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.



2

## ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు.

### సిబ్బంది, ప్రయాణికులతో

## మర్యాదగా ఉండాలి

### వేధింపులకు గురిచేయడం సరికాదు

### ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు.

2



## బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే

### అక్కడ చెరువు పదేకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి

### ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు.



# హోర్ముజ్ జలసంధిపై కొత్త నియమాలు

## పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు

### ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన

టెహ్రాన్, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు చేస్తామని తెలిపారు. తమ చర్యలు ఇరాన్ ప్రజలకు గర్వకారణంగా ఉంటాయన్నారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడం, విదేశీ జోక్యాన్ని తగ్గించడం,



ప్రాంతీయ నియంత్రణను పెంచడం, వాణిజ్య మార్గాలను తమ ఆధీనంలో ఉంచడమే ఆ నిబంధనల లక్ష్యాలని తెలిపారు. హోర్ముజ్ జలాలు భద్రత, అభివృద్ధికి మూలంగా మారాలని తాము కోరుకుంటున్నట్లు ఐఆర్‌జీసీ పేర్కొంది . కాగా, 'పర్షియన్ గల్ఫ్ కేవలం నీలి జలాల కేంద్రం మాత్రమే కాదు. అది మన గుర్తింపు. మన నాగరికతలో ఒక భాగం. ప్రపంచ దేశాల మధ్య అనుసంధాన కేంద్రం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం' అని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్న విదేశీ బలగాలకు ఇది ఓ హెచ్చరికగా చూడాలి. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యాయని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' తెలిపింది. మరోవైపు.. హర్మూజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను మా సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

## మరోమారు మెలిక పెట్టిన ట్రంప్

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్–అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

# సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు


## కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.

# లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

## ప్రదర్శనను ప్రారంభించిన అమిత్ షా



జమ్మూ, అక్షరకలం ప్రతినిధి

క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్ధార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్‌టన్ పెప్పె అనే బ్రిటిష్ జమీందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం

## ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి

## ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం

## మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18–25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25–45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

# సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం

## ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

శంషాబాద్ వద్ద ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్‌ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

## బిఆర్ఎస్‌కు ఎమ్మెల్యే దానం కౌంటర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు. కానీ దానికి సమ్యాదనం చెప్పకుండా బురదజల్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. . ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారంహైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్

## ఐపిఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్ ముఠాల ఆటకట్టు

హైదరాబాద్,

ఆన్‌లైన్ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి స్కామ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఏప్రిల్ నెలలోనే 184 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తొలగించగా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో 801 ఫేక్ యాడ్స్‌ను గుర్తించారు. అమాయకులను టార్గెట్ చేసి వారిని బెట్టింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌ల వైపు మళ్లించే ప్రొఫైల్స్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. డీప్‌ఫేక్ వీడియోలను ఉపయోగించి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఐపీఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించే ఈ ప్రొఫైల్స్ ద్వారా యువతను ఆకర్షించి మోసం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిరంతర సైబర్ పెట్రోలింగ్‌లో భాగంగా ఇప్పటివరకు 427 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను, 1,903 పెయిడ్ ప్రమోషనల్ అడ్వటంల్గ÷జ్‌మెంట్లను గుర్తించి తొలగించారు. ఈ ప్ర్గొ÷ల్స్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటికే 6 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అక్రమ డబ్బు మార్గాలపై దృష్టి సారించిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

## వేధింపులకు గురిచేయడం సరికాదు

## ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎ÷–లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# అప్పులు తీర్చడమెలా..అన్న ఆలోచనేదీ?

అప్పులు తీర్చడమెలా..రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమెలా .. అన్న ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు. కెసిఆర్ చేసిన అప్పుల గురించి ప్రశ్నించినప్పుడు ఆస్తులు సృష్టిస్తున్నామని అనేవారు. ఎపిలో చంద్రబాబుది కూడా అదే పాలసీ. కెసిఆర్ అప్పులు చేసి దివాళా తీసాడని ఆరోపించి, అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి అంతకు మించిన అప్పులు చేస్తున్నారు. చంద్రబాబు కూడా అదే కోవలో ఉన్నారు. జీతాలు, భత్యాలకు డబ్బులు లేవు. ఉచిత పథకాలకు మాత్రం చేతికి ఎముక లేదన్నంతగా దోచిపెడు తున్నారు. ఈ లెక్కన మరో వదందేళ్లయినా అప్పులు తేరవు. వీరు సృష్టించిన ఆస్తులు అప్పులు తీర్చలేవు. ఉన్న భూములను తెగనమ్మేస్తున్నారు. ప్రధానంగా ఖర్చులు తగ్గించుకుని అప్పులు లేకుండా చేసుకునే ప్రణాళికలు రచించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యం కావాలి. ఇందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదని గుర్తించాలి. పాలన పేరుతో రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం రేవంత్‌కి, చంద్రబాబుకు లేదు. అలాగే దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్లే ప్రయత్నాలను మోడీ కూడా సమర్థించరాదు. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయరంగాన్ని ఆధునీకరించాలి. రైతులు పండించిన ధాన్యాన్ని సక్రమంగా కొనడం లేదు. దానిని ప్రజలకు చేరవేయడం లేదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోక పోవడం వల్లనే రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. నెలనెలా వడ్డీలకే వేలకోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచిత పథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా తీస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు ముందు పెన్షన్లు రద్దు చేయాలి. రాజకీయ ప్రాపకం కోసం అందరికీ కేబినేట్ హోదాతో సలహాదారులను నియించుకోవడం పక్కన పెట్టాలి. అలాగే వీరి జీతభత్యాలను కూడా కనీసానికి తగ్గించాలి. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్న వేళ, సలహాదారులకు లక్షల్లో జీతాలు తగలేయడం సరికాదు. ఇందుకోసం ఉన్న భూములను తెగనమ్మడం, లిక్కర్ ధరలు పెంచడం, భూముల రిజస్ట్రేషన్ ధరలు పెంచడం, పరోక్షంగా పన్నులు బాదడం వంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఇందులో అసలు లబ్దిదారుల కన్నా అనర్హులే ఎక్కువ మంది ఉన్నారు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం కూడా ముఖ్యమే. తాజాగా తెలంగాణలో మరో ఇద్దరు సలహాదారులను నియమించారు. ఇప్పటికే ఉన్నవారికి తోడు మరో ఇద్దరికి పునరావసం కల్పించాల్సిన అసవరం ఏమొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేండ్లలో 14మంది సలహాదారులుగా నియమితులయ్యారంటే..వారు ఏంచేస్తారని జనం ప్రశ్నించాలి. వీరంతా క్యాబినెట్ హోదా ఉన్నవారే కావడంతో జీతాలు, భత్యాలు సరేసరి. ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు దాదాపు సమానంగా సలహాదారులు ఉన్నారు. వీరంతా లక్షలకు లక్షల జీతాలు, భత్యాలూ అందుకుంటున్నారు. సలహాదారులు రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగిస్తున్నారని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు మళ్లీ పలువురిని సలహాదారులుగా నియమించారు. అప్పులు తెచ్చి మరీ సలహాదారులకు జీతభత్యాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలు ఇంతమంది సలహా దారులను ఎందుకు నియమిస్తున్నారు. వారు ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు పోస్టులు సృష్టించిమరీ ఎందుకు నియమిస్తున్నారన్నది అర్థం కాదు. కెసిఆర్ చేసిన పనినే రేవంత్ కూడా చేస్తున్నారు. సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను ఆగమేఘాల పై ఢిల్లీ నుంచి తీసుకొచ్చి బాధ్యతలు అప్పజెప్పారు. తాజాగా విహెచ్‌ను, రిటైర్డ్ డిజిపి శివప్రసాద్ రెడ్డిని సలహాదారులుగా నియమించారు. సలహాదారుల పోస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పునరావాసం కోసం వాడుకొంటు న్నది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత మూడు రోజులకే ఏడుగురు సలహాదారు లను తొలగించారు. 'రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నదని ఆనాడు చెప్పారు. జనవరి 20న అంటే అధికారంలోకి వచ్చిన నెలన్నరకు సీఎం తనకు నమ్మకస్తుడైన వేం నరేందర్‌రెడ్డిని ప్రధాన సలహాదారుగా నియమించారు. క్యాబినెట్ హోదా కల్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ష బ్బీర్ అలీకి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ శాఖల ప్రధాన సలహాదారుగా, మరో సీనియర్ నేత హర్కర వేణుగోపాల్‌ను ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా నియమించి క్యాబినెట్ హోదా ఇచ్చారు. పార్లమెంటు ఎన్నికల




ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఏపీ జితేందర్‌రెడ్డిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా, బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కేశవరావును పబ్లిక్ ఎఫైర్స్ సలహాదారుగా నియమించారు. మరో మాజీమంత్రి సుదర్శన్ రెడ్డిని కూడా సలహాదారుగా నియమించారు. వీరంతా ఏం సలహాలు ఇస్తారు. తెలంగాణ గట్టెక్కడానికి ఏం చేస్తారన్నది ప్రశ్న. ఖజానాకు గండిపడుతుంటే కొత్తగా ఖర్చులు చేయడం వల్ల ప్రజలపై భారం పడుతుంది. దీనిని లోచించాలి. ఇలాంటి వారిని ప్రజల నెత్తిన రుద్దడం సరికాదు. ఖర్చులు తగ్గించడానికి అవసరమైతే ఓ కన్సల్టెన్సీని నియమించడం మంచిదేమో.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేడా,,తెల్లం.వెంకట్రావు,







**అక్షర కలం / భద్రాచలం**

దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధికార్యక్రమాలకుశంకుస్థాపనలుమరియుప్రారంభోత్స వకార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ – గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి.శ్రీనివాసరెడ్డి,భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం.వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్,జిల్లా ఎస్పీ.రోహిత్ రాజ్, ఐటిడిఎ పిఓ,బి.రాహుల్,భద్రాద్రి కొత్తగూడెం గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి.వీరబాబు,భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ జేష్ఠ, భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం.సీతమ్మ,సీతారాంపురం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి.శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం. వెంకట్రావు,చేతుల మీదుగా ప్రారంభోత్సవంచిన్న బండి రేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రివర్యులు మరియు స్థానిక ఎమ్మెల్యే,జిల్లా అధికారులు. చింతగొప్ప గ్రామంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ములకపాడు గ్రామంలో మినీ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం. ములకపాడు గ్రామం హాస్పటల్ క్రీడామా విధానంలో డి బి ఎన్ ఎల్. క్రికెట్ ప్రీమియం లిగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి.శ్రీనివాసరెడ్డి,స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం.వెంకట్రావు, చేతుల మీదుగా క్రికెట్ మ్యాచ్ ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు...

# ప్రభుత్వం అందించే ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేయాలి.----- ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య.

**అక్షర కలం / ఇల్లెందు.**



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజా ప్రతినిధులు నాయకులు క్రియాశీలక కార్యకర్తలు ప్రజలకు చేరవేయాలని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండలంలోని బొజ్జయిగూడెం ఎస్ ఎస్ గార్డెన్స్ లో నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డిఆర్డిఏ పిడి విద్యా చందన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి సవివరంగా వివరిస్తు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజల్లోకి చేరవేసేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు క్రియాశీలక కార్యకర్తలు నాయకులు మహిళా విభాగం యూత్ విభాగం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు నిర్వహించే మీటింగ్లలో ప్రభుత్వం ప్రజలకు అందించే స్కీములనూ సంక్షేమ పథకాలను విని ఊరుకోకుండా గ్రామ, పట్టణ స్థాయి నియోజకవర్గస్థాయి కేంద్రాలలో ప్రచారం చేయాలని ప్రతి పథకాన్ని గ్రామస్తులకు తెలియజేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించని విధంగా తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుదారులకు,సంక్షేమ హాస్టల్లో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు సన్న బియ్యం అందిస్తుందని ఆయన తెలిపారు. ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు ప్రయాణం,నూతన రేషన్ కార్డులు, నూతన వృద్ధాప్య, వితంతు ఒంటరి పెన్షన్లు, రైతుబంధు, రైతు భరోసా, పది లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం, రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి సొంత ఇంటి కల పథకమైన ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గం వారీగా 4, 500 లు మంజూరు చేసామని, లబ్ధిదారులు త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేయాలన్నారు. మరో 4, 500లు ఇందిరమ్మ ఇండ్లను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదవారికి తాత్కాలికంగా వైద్య ఖర్చులకు గాను ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్నామని తెలిపారు. రానున్న మరో రెండున్నర సంవత్సర కాలంలో ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా మణులకు అండగా ఉంటుందన్నారు. పేద ప్రజల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు,ఇల్లందు ఎంపీపీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కె. విజయ మేడం, ఇల్లందు మున్సిపాలిటీ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఇల్లందు ఎమ్మార్వో సూర్యప్రకాశరావు, ఇల్లందు ఎంపీడీవో కే.ధన్ సింగ్, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇల్లందు మున్సిపల్ మేనేజర్ అంకుషావలి, ఇల్లందు ఎంపీ ఓ చిరంజీవి,ఐదు మండలాల ఎంపీడీవో లు, ఎమ్మార్వోలు, ఎంపీఓస్,మండల అధికారులు, హౌసింగ్ ఏఈలు, మండలాల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు , స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 02:**





నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో కలుపు మందులు, నకిలీ, నిషేధిత విత్తనాల నియంత్రణపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితులలో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగు చేసే పంటల దిగుబడికి అవసరమైన మెలకువలను అందించడంతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన, నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిషేధిత కలుపు మందుల వినియోగం, తత్ఫలితంగా కలిగే నష్టాలపై వివరించాలని తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణపై టాస్క్ ఫోర్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, విత్తన, క్రిమిసంహారక విక్రయ డీలర్లు, దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, పంట సాగులో శాస్త్రీయ, సేంద్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయం, వినియోగం నియంత్రణపై సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. గత సంవత్సరం నకిలీ విత్తనాల లభ్యత ఆధారంగా నకిలీ విత్తనాలను నిల్వచేసే ప్రాంతాలను గుర్తించి తనిఖీలు చేపట్టాలని తెలిపారు. విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకించి యువత మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి


**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 02:**

మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగాన్ని వ్యతిరేకించి యువత మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల ఎంఎం గార్డెన్స్ లో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రగ్ అవగాహన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, భవిష్యత్తు నష్టాలను తెలుసుకొని సరైన మార్గంలో మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే చట్టపరమైన పరిణామాలు, సామాజిక ప్రభావాలపై విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, పిల్లల ప్రవర్తనలో ఏదైనా మార్పులు గుర్తించినట్లయితే వారి సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సహాయం అందించడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను వివరించి, సమాజంలో సన్మార్గాలపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయం జరిగినట్లయితే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని, యువత భవిష్యత్తును కాపాడాలని తెలిపారు. అనంతరం డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాలను వివరించే గోడప్రతులను ఆవిష్కరించారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



## కోహ్లీ వల్లే ఈ వికెట్ల జాతర

### అర్‌సీబీ బౌలర్ భువనేశ్వర్ కుమార్

ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ తన విజయాల పరంపరను కొనసాగిస్తోంది. సోమవారం రాత్రి ఢిల్లీలో ఢిల్లీ కేపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ స్కోర్ ను అలవోకగా అందుకుంది. 81 బంతులు మిగిలి ఉండగానే దీన్ని ఛేదించింది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే రెండో అతిపెద్ద విజయం. ఇప్పటివరకు ఆడిన ఎనిమిది మ్యాచ్ లల్లో ఆరింట్లో నెగ్గింది ఆర్సీబీ. మొత్తం 12 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ కేపిటల్స్ 16.3 ఓవర్లలో 75 పరుగులకు ఆలౌటైంది. ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ ఒక్కడే టాప్ స్కోరర్. 33 బంతుల్లో 3 ఫోర్లతో 30 పరుగులు చేశాడు. అర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ (3/5), జోష్ హేజిల్‌వుడ్ (4/12) ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించారు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మ, రసిక్‌ధర్ సలామ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.అనంతరం ఆర్‌సీబీ 6.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లీ (15 బంతుల్లో ఫోర్, 2 సిక్సులతో 23 నాటౌట్), దేవదత్ పడిక్కల్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 34 నాటౌట్) అజేయంగా నిలిచారు. జాకబ్ బెథెల్ 11 బంతుల్లో ఫోర్, రెండు సిక్సులతో 20 పరుగులు చేశాడు. తన బౌలింగ్ పట్ల భువనేశ్వర్ కుమార్ సంతృప్తిని వ్యక్తం చేశాడు. జట్టులో విరాట్ కోహ్లీ అనుభవం, అతను ఇచ్చిన విలువైన సూచనలు తనకు పనికొచ్చాయని చెప్పాడు. కోహ్లీ కేప్టెన్ గా లేకపోయినా అతని సలహాలు జట్టు ప్లానింగ్ లో గణనీయమైన మార్పును తీసుకొస్తున్నాయని తెలిపాడు. కోహ్లీ వంటి అనుభవజ్ఞుడి ఉనికి జట్టు వాతావరణం, మైదానంలో కీలక నిర్ణయాలపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీతో కమ్యూనికేషన్ చాలా ముఖ్యమని, బ్యాటింగ్‌లో గానీ, బౌలింగ్ లో గానీ అతని సలహాలు ఎంతో సహాయపడతాయని, అంత అనుభవం ఉన్న ఓ ప్లేయర్ జట్టులో ఉండటం ఓ గొప్ప అసెట్ భువి వివరించాడు. తన దృక్పథంలో కూడా మార్పును తీసుకొచ్చిన వ్యక్తిగా కోహ్లీని అభివర్ణించాడు భువనేశ్వర్ కుమార్. వ్యక్తిగత ప్రదర్శనల గురించి తాను పెద్దగా ఆలోచించనని, అందరూ సమష్టిగా ఆడితేనే జట్టు గెలుస్తుందని చెప్పాడు.


### బంతులు

## ఖచ్చితత్వంతో వేయాలి

### అప్పుడే వైభవ్ ని అడ్డుకోవచ్చు

### మిడిల్, ఆఫ్ స్టంప్ మీదుగా సంధించాలి

### టీమిండియా మాజీ క్రికెటర్ చేతేశ్వర్ పుజారా



ఐపీఎల్ లో నేడు మరో హైవెలాసిటీ మ్యాచ్ జరుగనుంది. ఈ సాయంత్రం చండీగఢ్ లో పంజాబ్ కింగ్స్ తో తలపడబోతోంది రాజస్థాన్ రాయల్స్. ఇప్పటివరకు ఓటమి ఎరుగని జట్టుగా ఉంటూ వస్తోన్న పీబీకేఎస్ ను వాళ్ల సొంత గడ్డపై రాజస్థాన్ రాయల్స్ ఎలా అడ్డుకుంటుందనేది ఈ రాత్రికి తేలిపోతుంది. పాయింట్ల పట్టిలో అగ్రస్థానంలో ఉన్న జట్లు ఇవి. పంజాబ్ టాప్ లో ఉండగా.. రాజస్థాన్ నాలుగో పొజిషన్ లో కొనసాగుతోంది. రాజస్థాన్ రాయల్స్ లో వైభవ్ సూర్యవంశీపైనే అందరి దృష్టి నిలిచిందనడంలో సందేహాలు అక్కర్లేదు. మొన్నటికి మొన్న సన్ రైజర్స్ హైదరాబాద్ పై సెంచరీ ఊది అవతలపడేశాడీ 15 సంవత్సరాల కుర్రాడు. అతన్ని అడ్డుకోవడంపైనే ఆ జట్టు భారీ స్కోర్ ఆధారపడి ఉంది. దీనికోసం పంజాబ్ కింగ్స్ ప్రత్యేకంగా వల పన్నడం ఖాయం. బౌలర్లు వేసే బంతులు ఖచ్చితత్వంతో కూడుకుని ఉండటం, సరైన్ లైన్ అండ్ లెంగ్త్ తో పడితేనే దాని ఫలితం ఉంటుంది.ఈ పరిస్థితుల మధ్య టీమిండియా మాజీ క్రికెటర్ చేతేశ్వర్ పుజారా తెరమీదికి వచ్చాడు. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు కొన్ని సూచనలు చేశాడు. వైభవ్ సూర్యవంశీని త్వరగా అవుట్ చేసే విషయంలో ప్రత్యేకించి సీమర్ అర్షదీప్ సింగ్ కు చిట్కాలు ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశికి బౌలింగ్ చేసేటప్పుడు మిడిల్, ఆఫ్ స్టంప్ మీదుగా బంతిని సంధించాలని చెప్పాడు. స్టార్ స్పోర్ట్స్ 'గేమ్ ప్లాన్' లో పుజారా మాట్లాడాడు. అర్షదీప్ బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బౌలింగ్‌పై దృష్టి పెట్టాలని, స్లో బాల్స్, యార్కర్లను కూడా ప్రభావవంతంగా ఉపయోగించాలని సూచించాడు. “అర్షదీప్ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ అయినందున వైభవ్ కోసం స్టంప్‌ల మీదుగా బౌలింగ్ వేయాలని, బంతి అతని నుండి బయటికి వెళ్ళేలా మిడిల్, ఆఫ్ స్టంప్ లపై పిచ్ అయ్యేలా లైన్ అండ్ లెంగ్త్ తో డెలివరీలు ఉండాలని చెప్పాడు. వైభవ్‌కు బౌలింగ్ చేసినప్పుడు మొహిసిన్ కొంత సక్సెస్ అయ్యాడని గుర్తు చేశాడు పుజారా. అర్షదీప్ కూడా అలాంటి టెక్నిక్ నే ఫాలో అయితే వైభవ్ సూర్యవంశీ దూకుడును అడ్డుకోవచ్చని సూచించాడు. అవసరమైతే ఓవర్ మిడిల్ లో యార్కర్లు కూడా వేయాల్సి రావొచ్చని, ప్రారంభంలో, మొదటి నాలుగు లేదా అయిదు బంతులను మాత్రం మిడిల్ అండ్ ఆఫ్ స్టంప్‌పై




బ్యాక్ ఆఫ్ లెంగ్త్‌ను అర్ష్ దీప్ సింగ్ నిలకడగా వేయాలని పుజారా వివరించాడు. అర్షదీప్ సింగ్, మార్కో జెన్‌సెన్, జేవియర్ బార్ట్‌లెట్‌ను కూడా వైభవ్ ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA



## ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ

'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.



## చీన్ టపాక్ డుం డుం ..సినిమా టైటిల్

చీన్ టపాక్ డుం డుం' అనే వినూత్నమైన టైటిల్‌తో ఓ కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచేలా ఉండనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు నటి సమంత క్లాప్ కొట్టగా, దర్శకుడు గోపిచంద్ మలినేని తొలి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేయగా, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇది ఆయనకు నిర్మాతగా తొలి సినిమా కావడం విశేషం. సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తుండగా, దువ్వాడ మాధురి ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను సెంథిల్ కుమార్ నిర్వహిస్తున్నారు. సంగీతాన్ని పీఆర్ మ్యూజిక్ అందిస్తుండగా, పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రైల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. వినోదభరితమైన కథ,




## మరోమారు సుకుమార్-రామ్ చరణ్ కాంబో

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానతో కలిసి తన 16వ చిత్రం పెద్దిలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సొంతం చేసుకోగా, తదుపరి ప్రాజెక్ట్‌పై కూడా అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది.చరణ్ కెరీర్‌లో 17వ సినిమాగా దర్శకుడు సుకుమార్‌తో ఓ భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. గతంలో సుకుమార్,చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా విడుదల తర్వాత రామ్ చరణ్ ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా వెంటనే తన 17వ సినిమాను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'పెద్ది' జూన్‌లో విడుదల కానుండగా, అదే నెలలో సుకుమార్ ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభించే ఎ÷-లాన్‌లో ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నారు. భారీ బడ్జెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. సుకుమార్ తన ప్రత్యేకమైన కథనం, డిఫరెంట్ టేకింగ్‌తో సినిమాలను తెరకెక్కించడంలో పాపులర్ కాగా, రామ్ చరణ్ కూడా తన నటనతో ప్రేక్షకులని మరింత అలరించే దిశగా ముందుకు సాగుతున్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌గా రాముదుర్గారెడ్డి బాధ్యతల స్వీకరణ

అక్షరకలం దేవరకొండ



దేవరకొండ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎం. రాముదుర్గారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా సంతకం చేసి బాధ్యతలను చేపట్టారు. ఇంతకుముందు ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన రాముదుర్గారెడ్డి, ప్రభుత్వ బదిలీ ఉత్తర్వుల మేరకు దేవరకొండకు వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పూర్ణచందర్ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో రాముదుర్గారెడ్డి బాధ్యతలు చేపట్టడం జరిగింది. కొత్త కమిషనర్ రాకను పురస్కరి ంచుకుని మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు సమర్పించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బంది సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. పట్టణవాసులకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని ఆయన వెల్లడించారు.

# దేవరకొండ నియోజకవర్గ ప్రగతిపై ఎమ్మెల్యే బాలు నాయక్ సమీక్ష





అక్షరకలం దేవరకొండ:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా దేవరకొండ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం శనివారం ఆర్డీవో రమణారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన వేగంగా జరుగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రోమోర్ సంస్థ ఏర్పాటు చేసిన ఎరువుల ప్రదర్శన స్టాల్‌ను సందర్శించి, రైతులకు అందుతున్న ఎరువుల నాణ్యతపై వివరాలు సేకరించారు. అదేవిధంగా గిరిజనులు తయారు చేసిన హస్తకళల ప్రదర్శనను తిలకించి, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ, వైద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఐకెపి సెంటర్‌లో బీజేపీ నేతల పర్యటన

అక్షరకలం దేవరకొండ

దేవరకొండ మండల పరిధిలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ మండల అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న కొనుగోలు జాప్యం, చెల్లింపుల ఆలస్యం వంటి సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాము నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు మద్దతు ధర కల్పించాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజయ్య, బిక్షపతి, దసరు నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి..ఉన్నత లక్ష్యాలను చేరుకోండి

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## డ్రగ్స్ రహిత నల్గొండ దిశగా అడుగులు

## క్లాక్ టవర్ సెంటర్లో భారీ అవగాహన సదస్సు

అక్షరకలం నల్గొండ



యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు, వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండ క్లాక్ టవర్



సెంటర్లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా, మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణపై అవగాహన కల్పించేందుకు పోలీస్ మరియు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అతిథులుగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు, వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. యువత క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటేనే విజయాన్ని సాధించగలరని తెలిపారు. యువత "మత్తు పదార్థాలకు నో చెప్పండి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరండి" అనిసమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం మరియు సమాజానికి తీవ్ర హానిని కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు స్నేహితుల ప్రభావం, ఆసక్తి లేదా ఒత్తిడి కారణంగా డ్రగ్స్ వైపు మళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలు దెబ్బతింటాయని, మానసికంగా ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అలాగే చదువుపై దృష్టి కోల్పోవడం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ ఆఫర్ చేసినప్పుడు స్పష్టంగా కాదు అని చెప్పాలని, చెడు స్నేహితులను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే 100 లేదా 1908 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ వినియోగం చట్టపరంగా నేరమని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్ వినియోగం పై వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, నల్లగొండ డీఎస్పీ శ్రీ శివరాం రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు , వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ శ్రీ మహాలక్ష్మయ్య, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# "చెప్పనివి" చేస్తున్నాం.. "ఇచ్చినవి" ఇస్తున్నాం

## ప్రభుత్వ వాగ్దానాలు, కొత్త పథకాలపై మంత్రి ప్రకటన

## ఇంటింటికీ ఇందిరమ్మ పథకాల మాల

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## ఇందిరమ్మ బీమా నుంచి జాబ్ మేళా వరకు.. మంత్రి సమీక్ష

## మే నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి లేదంటే కొత్త లబ్ధిదారులకు అవకాశం

## 5వేల మంది యువతకు నియామక పత్రాల పంపిణీ

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ప్రజలకు చెప్పని అనేక కొత్త కొత్త పథకాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భావనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన నల్గొండ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు గ్రామ ,మండల స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు మహిళలకు ఉచిత సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు ఎల్పిజి గ్యాస్, వంటి ఆరు గ్యారెంటీలను ఇచ్చి అమలు చేస్తున్నదని, అంతేకాక ఇవ్వని వాగ్దానాలు, దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వపరంగా మధ్యాహ్న భోజనం అందించనుందని తెలిపారు. ఉదయం రాజి జావ, మధ్యాహ్నం భోజనం ,సాయంత్రం సమయంలో అల్పాహారం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. ఇది తెలంగాణలో విప్లవాత్మకమైన పథకం అని అన్నారు. ఈ పథకం కింద సంవత్సరంలో 1400 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు .వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉచిత విద్యుత్తు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేయడం జరిగిందని, తిరిగి తమ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత బస్సు పథకం కింద రెండు కోట్ల 86 లక్షలు మంది మహిళలు బస్సులలో తిరగడం జరిగిందని, ఉచిత విద్యుత్ కింద 5000 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. నల్గొండ పట్టణంలో రామగిరి టెంపుల్ నుండి దేవరకొండ రోడ్డు వరకు 15 కోట్ల రూపాయలతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నామని, జాబ్ మేళా ద్వారా 5000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాల అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. న్యాక్ కేంద్రం ద్వారా టైలరింగ్, మెకానిక్ ఇతర ట్రేడులలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని, ఇంకా మరిన్ని కోర్సు ప్రవేశపెడతామని తెలిపారు. మహిళలకు ఆసక్తి ఉన్నవారందరికీ ప్రత్యేకించి మిషన్ నేర్చుకున్న వారందరికీ కుట్టు మిషన్లు ఇస్తామని చెప్పారు. నల్గొండ నియోజకవర్గంలో 740 మంది ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంకా ఇండ్లు మొదలు పెట్టలేదని, ఈ నెలాఖరు నాటికి చేపట్టిన ఇంద్రమైండ్లన్నీ పూర్తి కావాలని, ఎవరైనా ఇండ్లు నిర్మించుకునేందుకు ఇష్టం లేనట్లయితే తక్షణమే రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని, అలాంటి జాబితాను సోమవారం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలాంటి వారి స్థానంలో కొత్త లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరుగుతుందని, జూన్ నుండి మరో విడత ఇందిరమ్మ ఇండ్లు పొందేందుకు అనుమతి వస్తుందని, అందువల్ల మే చివరినాటికి నిర్మాణం చేపట్టిన ఇండ్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇండ్లను నిర్మించడం జరుగుతున్నదని తెలిపారు. ధాన్యం కొనుగోలులో భాగంగా రైతుల చెల్లింపులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రతి గ్రామం లో ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో దగ్గరగా ఉండేందుకు ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టే కార్యక్రమాలను చదివి వినిపించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర పవార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.





అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# నల్గొండలో "ఉద్యోగ" జాతర

### 5వేల మందికి ఉపాధి లక్ష్యం.!

### యువతకు అండగా

### 'ప్రజా పాలన'

### మెగా జాబ్ మేళాను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

### అభ్యర్థుల రద్దీ దృష్ట్యా నేడు కూడ నిర్వహించాలని

### కలెక్టర్‌కు ఆదేశం

### కంపెనీల్లో భద్రత ముఖ్యం

### ఫార్మా ప్రమాదాల నేపథ్యంలో మంత్రి కీలక హెచ్చరిక

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**





నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని "న్యాక్" (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సమస్యగా ఉందని, అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చదివిన చదువుకు ఉద్యోగం ఇచ్చే విధంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, అందులో భాగంగా అన్ని జిల్లాలలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ద్వారా 5000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని ఆయన కంపెనీలతో కోరారు. యువత పెద్ద ఎత్తున జాబ్ మేళాకు వస్తున్నందున ఆదివారం కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిమెంటు కంపెనీలు, రైస్ ఇండస్ట్రీస్, ఫార్మా తదితర అనేక కంపెనీలు ఉన్నాయని, అందువల్ల స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం తో పాటు, కంపెనీలపై కూడా ఉందని అన్నారు. నిరుద్యోగ యువత ఎలాంటి ఉద్యోగం వచ్చినా ముందుగా చేరాలని, అనవసరంగా సమయం వృధా చేసుకోవద్దని ,ఉద్యోగం చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోవాలని, ప్రత్యేకించి గ్రూపు ఇతర ఉద్యోగాలకు చదువుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంఎస్ ఎం ఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉందని, దీని ద్వారా కూడా స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. గతంలో తన హయాంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 18,400 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. నల్గొండ జిల్లా లోని న్యాక్ సంస్థ అతిపెద్దదని, దీని ద్వారా అనేక వృత్తులలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు .పట్టణంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం అన్ని కల్పించామని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలలో అనేక మంది చనిపోతున్నారని రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతను చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల జిల్లాలో ఫార్మా కంపెనీలో సంభవించిన ప్రమాదాల పై మాట్లాడుతూ అన్ని కంపెనీలు భద్రత చర్యలను తప్పకుండా పాటించాలని చెప్పారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 124 కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇచ్చేందుకు రావడం జరిగిందని, ఇందులో ఐటి, బ్యాంకింగ్ ,కంప్యూటర్ ,బిజినెస్ సర్వీస్ వంటి రంగాలలో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. కంపెనీలు వారి వద్ద ఉన్న అన్ని ఖాళీలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం రావడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మారుతుందని, ఇది మంచి అవకాశం అని అన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ డైరెక్టర్ రాజేందర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ కలెక్టర్ వై. అశోక్ రెడ్డి డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, జిల్లా క్రీడలు, యువజన సర్వీసులు అభివృద్ధిలో శాఖ అధికారి అక్బర్ ఆలీ, పరిశ్రమల శాఖ జిఎం సతీష్, న్యాక్ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## దేవరకొండలో ప్రతి సోమవారం 'డివిజన్ స్థాయి ప్రజావాణి'

**అక్షరకలం దేవరకొండ**



ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవరకొండ ఆర్డీవో (రాజస్వ మండలాధికారి) రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఏప్రిల్ 4 నుండి దేవరకొండలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ ప్రజావాణికి డివిజన్ స్థాయి అధికారులు అందరూ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు.

## నేడు కూడా జాబ్ మేళా నిర్వహణ ---కలెక్టర్ చంద్రశేఖర్

**అక్షరకలం నల్గొండ**

నల్గొండ న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) కేంద్రం లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత ఎక్కువగా వస్తున్నందున జాబ్ మేళాను రెండు రోజుల పాటు నిర్వహించాలన్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం కూడా జాబ్ మేళా ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన నిరుద్యోగ యువత ఆదివారం ఉదయం 9 గంటలకు న్యాక్ కేంద్రంలో ఉద్యోగాల కై వారి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్ మేళా ప్రారంభోత్సవం సందర్భంగా చాలామంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రావడం చూసిన మంత్రి ఆదివారం కూడా జాబ్ మేళాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు జాబ్ మేళాలను మరో రోజు పొడగించినట్లు కలెక్టర్ వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## దళిత క్రైస్తవుల పట్ల వివక్షత ను విడనాడాలి

### సుప్రీంకోర్టు తీర్పును పునః పరిశీలన చేయాలి

### ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫేడరేషన్ వ్యవస్థాపకులు

### గద్దపాటి విజయరామరాజు



**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

దళితులు, క్రిస్టియన్ మతం లో చేరితే ఎస్సీ హోదాను కోల్పోతారని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలన చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు గద్ద విజయరామరాజు అన్నారు. ఈ తీర్పుతో దళిత క్రైస్తవుల హక్కులకు, ఆత్మభిమానానికి అవరోధం ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ గాస్పల్ చర్చి లో జరిగిన క్రిస్టియన్ మైనారిటీ ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 14,15, 25 ప్రకారం దళిత క్రైస్తవుల హక్కులను కాపాడుకొనుటకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు, మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో భువనగిరిలో సమావేశం ఏర్పాటు చేసి, దళిత క్రైస్తవుల హక్కులను, ఐక్యతను కాపాడుకుంటామని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం దళిత క్రైస్తవులు నడుచుకుంటారని, మాపై వివక్ష చూపరాదని, మా దర్మం ప్రకారం మేము శాంతి, సహనం, ప్రేమ ఇతరులకు పంచుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు బ్రదర్ బట్టు ప్రేమ్ కుమార్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ దినకర్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు జాన్ జహంగీర్, ఆలేరు నియోజకవర్గం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు మందుల ఇసాక్, సెక్రటరీ జహంగీర్, ఉపాధ్యక్షులు పీటర్ బాబు, ట్రెసరర్ చిలుక సుధాకర్, మండల అధ్యక్షులు స్టీఫిన్, భాస్కర్, వలిగొండ బాలరాజ్, దేవధానం, ప్రకాష్, హరిబాబు, జోసఫ్, జాన్సన్, సుధాకర్, జాన్ క్రిష్టఫర్, దానియల్, దావీదు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ లో గడియారం అక్షయ కు గోల్డ్ మెడల్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 02:**




టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి – పల్లవి దంపతుల కుమార్తె డాక్టర్ గడియారం అక్షయ గోల్డ్ మెడల్ సాధించింది. శుక్రవారం హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన స్నాతకోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అక్షయ ఎంబిబిఎస్ పట్టాను, గోల్డ్ మెడల్ ను అందుకుంది. ఈ సందర్భంగా ఆమె తండ్రి టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఎంబిబిఎస్ లో తన కుమార్తె అక్షయ గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకుంటూ, వైద్యురాలుగా బీద ప్రజలకు ఉచిత సేవలు అందించేందుకు ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గడియారం అక్షయ ను ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు, టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని అన్ని యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రహరీ గోడను తొలగించిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది

### లంచం ఇవ్వలేదని ప్రహరీ గోడ కూల్చివేత బాధితుల ఆవేదన...

**మందమర్రి, మే 02 అక్షర కలం:**

పట్టణంలోని మూడవ జోన్ కు చెందిన బొద్దిరెడ్డి రవీందర్ రెడ్డి ఇంటి ప్రహరీ గోడను శనివారం సింగరేణి ఏరియా ఎస్ అండ్ పీసీ సిబ్బంది కూల్చివేశారు. సెక్యూరిటీ సిబ్బంది తమను 20 వేల రూపాయలు లంచం అడగగా, నిరాకరించడంతో తన ప్రహరీ గోడను తొలగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, తాను, తన కుటుంబ సభ్యులు అదే ప్రాంతంలో గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, తమకు వివాహాలు అయ్యి, కుటుంబం పెద్దది కావడం, ఇల్లు శిథిలావస్థకు చేరడంతో రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తో పాటు ఏరియా జిఎం కు సమస్యను వివరించగా, వారు ఇంటిని బాగు చేసేందుకు అనుమతులు సైతం ఇచ్చారని తెలిపారు. వారి అనుమతులతో ఇంటిని బాగు చేసుకోగా, ప్రహరీ గోడ మాత్రం కాలువకు కొద్దిగా ముందుకు వచ్చిందని, అయితే ఇదే ప్రాంతంలో అదే కాలువపై అనేక ఇండ్లు, షాపులు నిర్మాణం జరిగాయని, వాటిని తొలగించకుండా కేవలం తమను, తమ ఇంటి నిర్మాణం మాత్రమే లక్ష్యంగా చేసుకుని సెక్యూరిటీ సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటి ప్రహరీ కూడా నిర్మాణం చేస్తున్న సమయంలోనే ఏరియా సింగరేణి ఎస్ అండ్ పీసీ విభాగానికి చెందిన జంగా శ్రీనివాస్, గుజ్జు కోమురయ్య లు వచ్చి నిర్మాణాన్ని పరిశీలించారని, అప్పుడు నిర్మాణాన్ని అడ్డుకోకుండా, నిర్మాణం పూర్తయిన అనంతరం తమకు ఫోన్ లో, ఇంటికి వచ్చి మరి 20 వేల రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారని, తాము లంచం ఇవ్వడానికి నిరాకరించడంతో ప్రహరి గోడ తోపాటు ఇంటిని సైతం తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. సరిగ్గా వారం తర్వాత శనివారం వారు ఏరియా సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీసులతో కలిసి వచ్చి, తమ ఇంటి ప్రహరీ గోడను కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్మాణాన్ని మొదట్లోనే ఆపితే తమకు లంచం రాదనే కారణంగానే నిర్మాణం పూర్తయిన అనంతరం లంచం అడుగగా, తాము నిరాకరించడంతోనే ఇంటి ప్రహరీ గోడను తొలగించి, తమను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. నిర్మాణం పూర్తైన తర్వాత కట్టడాన్ని తొలగించడంతో తీవ్ర అన్యాయం జరిగిందని, లంచం అడిగి, వేధింపులకు పాల్పడిన సెక్యూరిటీ సిబ్బంది పై తక్షణమే విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తన తమ్ముడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇప్పటికీ చికిత్స పొందుతున్నాడని, తమకు ఆడపిల్లలు కలరని, ఇల్లు లేకపోవడం, తమ్ముని చికిత్స తో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ, అప్పు చేసి ఇంటి నిర్మాణాన్ని చేస్తుండగా, కనీసం మానవత్వం లేకుండా లంచం కొరకు తమను వేధింపులకు గురి చేయడం సరైనది కాదన్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా కాగా, అధికారులు స్పందించి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## 5న ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

**మందమర్రి, మే 02 అక్షర కలం:**



పట్టణ పురపాలక సంఘ పరిధిలోని షెడ్యూల్ కులాల (ఎస్సీ) వారికీ 2025–26 సంవత్సరానికి సంబందించిన రుణాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి మే 5న పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూ లు నిర్వహించడం జరుగుతుందని పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూ లకు ఆన్లైన్ నందు అప్లై చేసుకున్న లబ్ధిదారులు మాత్రమే సంబంధిత సర్టిఫికెట్లు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రములు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, విద్యార్హత కలిగిన ఒరిజినల్ సర్టిఫికెట్ లతో పాటు ఒక్క జిరాక్స్ సెట్టు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో మున్సిపల్ కార్యాలయంలో జరిగే లబ్దిదారుల ఎంపిక ఇంటర్వ్యూ లకు హాజరు కావాలని సూచించారు.

## ఇకపై ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**



జిల్లాలోని ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు, ఇకపై ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఆయా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత ఆర్డీఓ (రెవెన్యూ డివిజనల్ అధికారి) నోడల్ అధికారిగా వ్యవహరించగా, అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇకపై ఎన్ఐసీ (చీ×జ) పోర్టల్ స్థానంలో సీజీజీ (జ++) ప్రజావాణి పోర్టల్ (జవఔవతీ టశీతీ +శీశీస +శీజవతీఝఅషవ) ద్వారా నమోదు (అప్లోడ్) చేయడం జరుగుతుందని వివరించారు. ప్రతి వినతిదారునికి యూనిక్ రిఫరెన్స్ నంబర్‌తో కూడిన రసీదు కూడా పత్రం ఇవ్వడం జరుగుతుందని, దీని ద్వారా వారు తమ వినతి స్థితిని ఆన్‌లైన్‌లో సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ఈ పోర్టల్ ద్వారా వినతుల నమోదు, శాఖల వారీగా కేటాయింపు, చర్యల నివేదికలు (ూుు=), మధ్యంతర నివేదికలు, ఫిర్యాదుల స్థితి పర్యవేక్షణ సులభతరం అవుతుందన్నారు.అన్ని శాఖల అధికారులు వినతులను 30 రోజుల్లోపు పరిష్కరించి, సంబంధిత నివేదికలను పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు.

# అభినయాల తారకి.. అక్షర నీరాజనం..

చారడేసి కళ్లు.. వంకీల జుట్టు.. అన్నింటికి మించిన అభినయం.. ఆమెను గొప్పనటిని చేశాయి. వెండితెరపై వెలుగొందిన తార.. కృష్ణుడు అంటే ఎన్టీఆర్ ఎలాగో, సత్యభామ అంటే జమునే మన మదిలో మెదులుతారు. మిస్సమ్మ చిత్రంలో అమాయకత్వం.. పండంటికాపురంలో రాణీ మాలినీదేవి.. మూగమనసులలో గౌరమ్మ.. గుండమ్మ కథలో పెంకిపిల్ల.. ఇలా అనేక పాత్రలు ఆమె అద్భుత అభినయానికి అద్దంపడతాయి. నాటితరం తెలుగు ప్రేక్షకుల్లో ఆమె అభిమానులు అనేకమంది.. ఆమె స్టయిల్‌ను ఫాలో అయిన నాటి మహిళలు ఎందరో.. తెలుగు చిత్ర పరిశ్రమలో కథానాయకులుగా రాణించినవాళ్లు ఎంతోమంది ఉన్నారు. అందులో కొందరు మాత్రమే తమదైన కళా ప్రతిభను ప్రదర్శించి, తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అలాంటి నటీమణుల్లో మణిపూస జమున. ఆమె మాతృభాష తెలుగు కాకపోయినా, తెలుగింటి అమ్మాయిగా ప్రేక్షకుల మదిలో స్థిరస్థాయిగా నిలిచిపోయారు.తండ్రి వ్యాపారరీత్యా మకాం దుగ్గిరాలకు మార్చారు. అక్కడే జమున హైస్కూలు విద్యాభ్యాసం మొదలైంది. చదువులోనే కాదు.. ఆటపాటల్లోనూ జమున ఫస్ట్. అంతరజిల్లా పాటల పోటీల్లో జమునకు ప్రథమ బహుమతి వచ్చింది. అప్పటి





నుంచీ నటన, గానం, సంగీతంపై ఆమె మక్కువ ఏర్పడింది. 'ఛలో ఢిల్లీ' నాటకంలో వసుంధర పాత్ర పోషించారు. అప్పట్లో కమ్యూనిస్టుల ప్రాభవం.. ప్రజానాట్యమండలిగా వర్ధిల్లుతున్న దశ. ఆ సమయంలో గరికపాటి రాజారావుగారు జమునతో 'మా భూమి' నాటకంలో కమల చెల్లెలుగా కీలకపాత్ర వేయించారు. ఆమె నటనను చూసి, సినీ పరిశ్రమకూ రాజారావుగారే పరిచయం చేశారు. బుర్రకథ పితామహుడు నాజర్ ఆధ్వర్యంలో జమున శిక్షణ తీసుకొన్నారు. సంగీతం అంటే జమునకు మక్కువ. చిన్నప్పుడే హార్మోనియం, వీణ నేర్చుకొన్నారు.

### సినీ అరంగేట్రం..

దుగ్గిరాలకు చెందిన శ్రీమన్నారాయణకు చిత్రసీమతో అనుబంధం ఉంది. ఆయన కొన్ని చిత్రాల్లో నటించారు. ఆయన సిఫార్సు మేర 'జై వీర భేతాళ' అనే జానపద చిత్రంలో కథానాయికగా జమునకు అవకాశం వచ్చింది. అందులో గుమ్మడి కథానాయకుడు. స్కూలు ఫైనల్ పరీక్షల్ని సైతం పక్కన పెట్టి, అమ్మానాన్నలతో మద్రాస్ బయల్దేరింది జమున. 'జై వీర భేతాళ'లో మంచి వేషమే. ఈ సినిమాతో కెరీర్ మలుపు తిరుగుతుందనుకున్నారు జమున. కానీ దురదృష్టవశాత్తూ ఆ చిత్రం మధ్యలోనే ఆగిపోయింది. అయితే.. జమున నిరాశ పడలేదు. ఆ విషయం ఆమె ఎక్కడా ప్రస్తావించేవారు కాదు. ఆ వెంటనే ప్రజానాట్యమండలికి చెందిన గరికపాటి రాజారావు నిర్మించిన 'పుట్టిల్లు'లో ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే 'వద్దంటే డబ్బు' ఆఫర్ వచ్చింది. అయితే ఈ రెండు చిత్రాలూ బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. తొలి సినిమా ఆగిపోవడం, రెండు చిత్రాలు ఫ్లాప్ అవ్వడంతో జమున కెరీర్ ఏమవుతుందోనని అనుకున్నారు. కానీ 'మా గోపీ' చిత్రం ఆర్థికంగా విజయం సాధించడంతో పాటు జమునకూ మంచిపేరు తెచ్చింది. 'నిరుపేదలు', 'మిస్సమ్మ', 'వదిన గారి గాజులు', 'అంతా మనవాళ్లే' ఇలా వరుస విజయాలతో జమున చిత్రసీమలో ఒక వెలుగు వెలిగారు. ఏ పాత్రకైనా జమున సరితూగుతుందన్న గుర్తింపు తెచ్చుకొన్నారు. 'దొంగరాముడు', 'తెనాలి రామకృష్ణ', 'మూగ నోము', 'రాము', 'బొబ్బిలి యుద్ధం', 'నాదీ ఆడజన్మే', 'పూల రంగడు', 'రాముడు – భీముడు'... ఇలా ఒకటా రెండా, పదుల సంఖ్యలో సినిమాలన్నీ సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. అన్నపూర్ణ, జగపతి, సురేశ్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థలన్నింటిలోనూ జమున చిత్రాలు చాలానే చేశారు. ఎన్టీఆర్‌తో ఏకంగా 31 చిత్రాల్లో జమున కథానాయికగా నటించారు. దాదాపు అవన్నీ హిట్లే. అన్నింట్లోనూ రకరకాల పాత్రలు చేయడం వైవిధ్యభరితంగా జమున పేరొందారు. అలా జమున కెరీర్ నాన్‌స్టాప్‌గా దూసుకుపోయిందనే చెప్పాలి.

### పదేళ్లుగా కథనాయికగా..

కథానాయికగా పదేళ్లు చిత్రసీమలో ఉండడం ఓ అరుదైన ఘనత. దానికి కారణం.. విభిన్నమైన పాత్రలు, విలక్షణమైన నటన. అల్లరి అమ్మాయిగా, పొగరుబోతు గృహిణిగా, అమాయకపు ఇల్లాలిగా ఇలా అన్ని పార్శ్వాలూ పలికించారు. సత్యభామ పాత్రలకు ఆమెదే పేటెంట్. సత్యభామ పాత్రని ఎలా చేయాలో భావి తరాలకు ఆమె ఓ పాఠం నేర్పించి వెళ్లారు. 'వినాయక చవితి'లో తొలిసారి సత్యభామ అవతారం ఎత్తారు జమున. అందులో ఆ పాత్ర సాత్వికంగానే ఉంటుంది. 'శ్రీకృష్ణ తులాభారం'లో మాత్రం సత్యభామగా జమున విశ్వరూపం చూడొచ్చు. 'సత్యభామ పాత్రని నువ్వు చేయలేవు..' అని హితులు, శ్రేయోభిలాషులు ఆమెను వెనక్కిలాగే ప్రయత్నం చేస్తే ఓ ఛాలెంజ్‌గా స్వీకరించి, ఆ పాత్రని రక్తికట్టించారు. అప్పటి నుంచీ.. సత్యభామ పాత్రంటే జమున గుర్తుకురావడం పరిపాటి. 'పండంటి కాపురం'లో రాణీ మాలినీదేవి.. పాత్ర జమున కెరీర్‌లో మరో కలికితురాయి.

### ట్రెండ్ ఫాలోయర్..

పెద్దింటి అమ్మాయిగా రాణీమాలినీ దేవిగా ఆమె చూపించిన దర్పం.. ఇంకెవ్వరికీ సాటి రాదు. జమున కట్టు బొట్టు కూడా కొత్తగా కనిపిస్తాయి. ఆమె కళ్లకు పెట్టుకునే కాటుక దగ్గర నుంచి, ఆమె చీర కట్టుకూ అప్పట్లో ఎంతోమంది అభిమానులు. 'జమున చీరలొచ్చారు' అంటూ వస్త్ర దుకాణాల దగ్గర బోర్డులు పెట్టేవారంటే.. ఆ రోజుల్లో జమున క్రేజ్‌ని ఎంతుందో అర్థం చేసుకోవొచ్చు. ఆమె స్టయిల్‌ను హావభావాలతో సహా నాటి మహిళలు ఫాలో అయ్యేవారంటే అతిశయోక్తి కాదు.



ఆమె మాట తీరు, ఆ దర్పం అన్నీ ఆమె అభిమానులు చాలామంది అనుకరించేవారు.

### ఇష్టాయిష్టాలు..

జమునకు కుక్కలంటే చాలా ఇష్టం. ఆమె ఇంట్లో ఎప్పుడూ ఓ అరడజను బుజ్జి కుక్కలు తిరుగుతూ ఉంటాయి. దాదాపు తన జీవిత కాలంలో దాదాపుగా వంద కుక్కపిల్లల్ని పెంచుకొన్నారావిడ. ఆమెకు వెన్న, మీగడ అంటే ఎంతో ఇష్టం. తన స్నేహితుల దగ్గరికి ఆమె ఎప్పుడు వచ్చినా.. వారు ఆమె దగ్గరికి వచ్చినా వెన్న, మీగడ తీసుకుని వస్తారు. ఆమెకు అవి అంటే అత్యంత ప్రీతిపాత్రం.

### విభేదాలు..సర్దుబాట్లు..

'భూకైలాస్' చిత్రం షూటింగ్‌లో జరిగిన ఓ సంఘటన కారణంగా ఎన్టీఆర్, ఏయన్నార్ జమునతో కలసి నటించకూడదని నిర్ణయించుకొన్నారు. ఆ తర్వాత మూడేళ్ల పాటు వీరి ముగ్గురి మధ్య మాటలే లేవు. 'గుండమ్మ కథ' చిత్రంతో వీరి మధ్య రాజీ కుదిరింది. ఎన్టీఆర్, ఏయన్నార్, జమున లను ఒకచోట కూర్చో బెట్టి రాజీ కుదిర్చింది చక్రపాణి. అక్కినేని సరసన గుండమ్మ కథ చిత్రంలో నటించిన జమున ఈ ఒప్పందంలో భాగంగా నందమూరితో 'గులేబకావళి కథ' చిత్రంలో నటించారు. అలాగే అక్కాచెల్లెళ్లలా ఉండే సావిత్రితో కూడా ఎవరో గిట్టనివాళ్లు తగాదాపెట్టారని, ఏడాదిపాటు మాట్లాడుకోలేదనీ, ఆ తర్వాత మళ్లీ కలిసిపోయామని జమున ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అలాగే తమిళ చిత్రసీమలో జయలలితతోనూ రిహార్సల్స్ సందర్భంలో గొడవపడినా, ఆమె నటన చూసి, ఫిదా అయినట్లు జమున ఒక సందర్భంలో చెప్పారు.

### కొత్త హీరోలతోనూ..

హీరోయిన్‌గా అగ్ర స్థానంలో ఉన్న తరుణంలో కూడా కొత్త హీరోల సరసన నటించడానికి జమున అభ్యంతరం చెప్పేవారు కాదు. కైకాల సత్యనారాయణ తొలి చిత్రం 'సిపాయి కూతురు'లో జమునే హీరోయిన్. అలాగే రమణమూర్తి తొలి చిత్రం 'ఎమ్మెల్యే'లో కూడా జమున కథానాయికగా నటించారు. అలాగే హరినాథ్ తొలిచిత్రం 'మా ఇంటి మహలక్ష్మి'లో జమునే కథానాయిక. వీరి తర్వాత తరంలో కృష్ణంరాజు విలన్ వేషాల నుంచి హీరో పాత్రలు వేయడం మొదలుపెట్టినప్పుడు ఆయన సరసనా జమున నటించారు. సాధారణంగా హీరోయిన్లకు కెరీర్ చాలా తక్కువ. నిత్యం పోటీని ఎదుర్కొంటూ కొంతకాలం తర్వాత తెర మరుగవుతుంటారు. కానీ జమున విషయం అలా కాదు. ఎన్టీఆర్, ఏయన్నార్‌తో ప్రారంభించి, తర్వాతి తరం హీరోలు కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, రామకృష్ణతో కూడా ఆమె నటించారు. హాస్య చిత్రాల కథానాయకుడు చలం సరసన 'మట్టిలో మాణిక్యం' సినిమాలో జమున హీరోయిన్‌గా నటించడం ఆ రోజుల్లో సంచలనం. దాదాపు పాతికేళ్లు హీరోయిన్‌గా కొనసాగి, జమున చరిత్ర సృష్టించారు.



### ఆ పాట నాడు గొప్ప క్రేజ్..

ఎన్టీఆర్, కృష్ణ హీరోలుగా నటించిన 'దేవుడు చేసిన మనుషులు' చిత్రంలో 'తొలిసారి నిన్ను చూశాను నేను' పాటలో జమున ఇచ్చిన అప్పియరెన్స్ అప్పట్లో పెద్ద క్రేజ్. అందులో హీరో అమ్మాయిలతో ఎక్కువగా తిరుగుతుంటాడు. అలాంటి క్యారెక్టర్ పక్కన ఎందుకు చేశావంటూ జమున విమర్శలు సైతం ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కృష్ణ, జమున 'మమత' చిత్రంలో కలసి నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కొడైకెనాల్‌లో జరుగుతున్నప్పుడు 'దేవుడు చేసిన మనుషులు' చిత్రం పాటలో నటించమని కృష్ణ అడిగితే జమున కాదనలేకపోయారని ఒక సందర్భంలో ఆమె చెప్పారు.



### బహుభాషా నటి..

జమున కన్నడ అమ్మాయి అయినా.. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కూడా నటించారు. ఆ చిత్రాలు కూడా ఘన విజయాలందుకున్నాయి. తమిళ మహానటులు ఎంజీఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ వంటి వారితో జమున నటించి, ఆకట్టుకున్నారు. 'పణం పడుత్తుం పాడు' (1954), చిత్రంతో కోలీవుడ్‌కు పరిచయమయ్యారు. 'మిస్సియమ్మ(మిస్సమ్మ)', తెనాలి రామన్, తంగమలై రహస్యం, తిరుట్టు రామన్, నాళయతీర్పు వంటి పలు విజయవంతమైన చిత్రాలు జమున నటించినవే. క్యారెక్టర్ నటిగా 'తూంగాదే తంబి తూంగాదే' చిత్రంలో కమల్‌హాసన్‌కు తల్లిగా నటించారు. అప్పట్లో తమిళ పరిశ్రమలో హీరోలకు సమానంగా పారితోషికం పొందిన సావిత్రి తర్వాత ఆ స్థాయిలో అందుకున్న నటి జమునే.


మూడేళ్ల పాటు ఇద్దరు అగ్ర హీరోలు జమునని దూరం పెట్టారు. ఆ సమయంలో జమున బాలీవుడ్‌పై దృష్టి పెట్టారు. అక్కడ 12 చిత్రాల్లో నటించారు. 'మిలన్' చిత్రం ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. ఈ సినిమాకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది. అప్పుడే చాలామంది ముంబైకి మకాం మార్చేయమని జమునకు సలహా ఇచ్చారు. అందుకు ఆమె సమ్మతించలేదు. తెలుగు చిత్రసీమని వదల్లేదు. 'గుండమ్మ కథ'తో జమున హవా మళ్లీ మొదలైంది. కథానాయికగా కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే తిరుపతిలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న రమణారావుని వివాహం చేసుకొన్నారు జమున. పెళ్లి తరవాత కూడా పదేళ్ల పాటు కథానాయికగా అగ్ర స్థానంలోనే ఉన్నారు. అందుకు భర్త సహకారం చాలా ఉందని ఆమె ఒక సందర్భంలో చెప్పారు. ఆ తరవాత కొడుకు వంశీకృష్ణ, కూతురు స్రవంతి పుట్టారు. అటు పిల్లల్ని చూసుకొంటూ, ఇంటి వ్యవహారాలు చక్కబెట్టుకొంటూ, సినిమాల్లోనూ జమున రాణించారు.

### నా కూతుర్ని చూసి గర్వపడుతుంటా!

స్రవంతి ప్రపంచస్థాయి కళాకారిణిగా రాణిస్తుంది. అమ్మగా ఇంతకంటే సంతోషం ఏం కావాలి? ఐ లవ్ హర్. మనవడూ అమ్మ దారిలోనే గుర్తింపు తెచ్చుకుంటున్నాడు అని ఆమె కూతురు, మనవడు గురించి సగర్వంగా చెబుతారామె.

### కలకాలం కళాకారిణిగా..

కళాకారుల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎనలేని సేవలు చేశారు జమున. రాష్ట్రమంతా తిరిగి పదివేల మంది కళాకారుల వివరాలు సేకరించారు. వాళ్లకు ఇళ్లస్థలాలు మంజూరు చేయడంలో కృషి చేశారు. కొన్ని కాలనీలకు 'జమున' పేరు పెట్టడం ఆమె కృషికి నిదర్శనం.



# స్నేహ సంఘాలను బలోపేతం చేయాలి.

**సామాజిక రుగ్మతల నివారణకు సంఘాలు దోహదపడాలి.**

**సంఘాల సభ్యులకు ప్రత్యేక డ్రెస్ కోడ్ అవసరం.**

**సమ్మర్ క్యాలెండర్ సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



**అక్షర కలం జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక రుగ్మతలను నివారించేందుకు స్నేహ సంఘాల సభ్యులు తమ వంతుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. స్నేహ సంఘాల సమ్మర్ క్యాలెండర్ యాక్షన్ ప్లాన్ పై శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో 15 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలతో 5-25 మందితో ఒక స్నేహ సంఘాన్ని ఏర్పాటు చేయవచ్చన్నారు. జిల్లాలోని 241 గ్రామపంచాయతీలలో ఇప్పటివరకు 568 సంఘాలను ఏర్పాటు చేయగా, ఇందులో 6662 మంది సభ్యులు ఉన్నారన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో స్నేహ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ ఇందులో సంబంధిత గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు, తదితర గ్రామస్థాయి అధికారులు, సిబ్బందిని భాగస్వాములను చేస్తే సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. సభ్యులకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉంటే గుర్తింపు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించే విద్యా వారోత్సవాల్లోనూ స్నేహ సంఘాల సభ్యులను భాగస్వాములను చేయాలన్నారు. ఈనెల 4న మండల స్థాయిలో స్నేహ సంఘాల సమ్మర్ క్యాలెండర్ కు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. జిల్లాలో హెచ్ పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి జ్యోతి, డీఎల్పీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.

**అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల అమలు.**

**నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు.**



**అక్షర కలం జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ప్రత్యేక అధికారి, ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గద్వాల నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని శనివారం స్థానిక బృందావన్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా వివిధ శాఖలకు సంబంధించి వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆయా శాఖల పనితీరు మెరుగుపరచడమే కాక అమలు చేస్తున్న వివిధ పథకాలను గురించి పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ కార్యక్రమాలను గురించి వివరించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తమ పాటల ద్వారా వివరించారు. అనంతరం పలువురు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్ ను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. అలాగే ఇందిరా మహిళా శక్తి రుణాలకు సంబంధించిన రూ.4.90 కోట్ల చెక్కును మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ముఖ్య అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ ఛైర్మన్ శంకర్, డీఎస్పీ మొగిలయ్య, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్ , గద్వాల ఇన్చార్జి తహసిల్దార్ మంజుల, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ.

**పదిలో వంద శాతం ఫలితాలే లక్ష్యం.**

**విద్యా శాఖపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష.**

**అక్షర కలం జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రతినిధి**



మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు త్వరలో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలపై శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విద్యాశాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాలు, విద్యార్థుల నమోదు, పాఠశాల మౌలిక వసతులపై కీలక సూచనలు జారీ చేశారు. ప్రతి పాఠశాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితాను సబ్జెక్టు వారీగా సిద్ధం చేసి, వారికి 15--20 రోజుల పాటు ప్రత్యేక రీమిడియల్ తరగతుల ద్వారా సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. వారం రోజుల్లో పరీక్ష ఫీజులు చెల్లింపులు పూర్తి చేయించి, జూన్‌లో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల కోసం కేజీబీవీలలో భోజన వసతి సౌకర్యాలతో పాటు, బాలురకు ప్రత్యేక పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఉన్నత విద్యలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్, డిప్లొమా తదితర కోర్సులపై అవగాహన కల్పించి, విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారి అడ్మిషన్ల వివరాలను రోజువారీగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగామే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న "ఎడ్యుకేషన్ వీక్" కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ వారోత్సవాల్లో పాఠశాలలలో మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రారంభం, రీమిడియల్ క్యాంపులు, సర్పంచ్‌లతో వర్క్‌షాప్, బడిబాట ద్వారా నమోదు పెంపు, లైబ్రరీ దినోత్సవం, ఆర్ట్-క్రాఫ్ట్ కార్యక్రమాలు, బాలభవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మరుగుదొడ్లు, మరమ్మతులు, విద్యుత్ సదుపాయం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# అందరికీ నాణ్యమైన విద్య, ఉచిత సమగ్ర వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

## ..మంత్రి దామోదర్ రాజ నరసింహ



**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను



ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలందించేందుకు ట్రామా, ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా గతంలో పావలా వడ్డీ పథకం, అనంతరం వడ్డీ లేని రుణాల పథకాలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి వనరులను మహిళలకు కేటాయిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పడుతున్నదన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం, మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రూ. 200 కోట్ల వ్యయంతో సింగూర్ లైన్ పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా విద్య, వైద్య రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్నదని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ మాట్లాడుతూ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్ శాఖ ద్వారా రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి.

**పరీక్ష రాసే అభ్యర్థులు నిబంధనలను పాటించాలి.**

**ఇన్విజిలేటర్లు బాధ్యతతో విధులు నిర్వహించాలి.**

**ఇన్విజిలేటర్ల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**అక్షర కలం జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈ నెల 3వ తేదీన నిర్వహించు నీట్ పరీక్షకు సంబంధించి శనివారం గద్వాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బాలికోన్నత పాఠశాల కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు నిర్వహిస్తున్న



శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. జిల్లాలో నీట్ పరీక్షకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు సిఎస్ లు, అబ్జర్వర్లు, తహసిల్దార్ లు, పోలీసు శాఖ అధికారులు, తదితరులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి గదిలో 24 మంది అభ్యర్థులకు ఇద్దరు ఇన్విజిలేటర్లు ఉంటారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. జాతీయస్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ పరీక్షలో చిన్న తప్పిదం జరిగినా అభ్యర్థులందరూ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జిల్లాలో గతేడాది నీట్ పరీక్షను విజయవంతం చేసినట్లే ఈ ఏడాది కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఒక సారి పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను తనిఖీ చేసి పంపించాక, పరీక్ష ముగిసేంత వరకు ఎట్టి పరిస్థితుల్లో తిరిగి వారిని బయటకు పంపడానికి వీలు లేదన్నారు. హాల్ టికెట్ల ను జాగ్రత్తగా పరిశీలించి అభ్యర్థులను కేంద్రం లోపలికి అనుమతించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ లోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా సిద్ధమై పరీక్ష రాసేందుకు రావాలన్నారు. అభ్యర్థులు షూస్ కూడా వేసుకోవడానికి అనుమతి లేనందున స్లిప్పర్స్ వేసుకురావాలన్నారు. పరీక్ష రాసేటప్పుడు ఓఎంఆర్ షీట్ లో కొంతమంది అభ్యర్థులు సెంటర్, ప్రశ్నాపత్రం కోడ్, తదితర అంశాలను తప్పుగా రాస్తుంటారని, వారికి ఇన్విజిలేటర్లు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడమే కాక అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్, తహసిల్దారులు నరేష్, నందిని, విజయ్ కుమార్, ఇతర అధికారులు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు భరోసా.. ఎమ్మెల్యే పాయం.


**అక్షర కలం/ పినపాక.**



నిరుపేదలకు సీఎం సహాయ నిధి చెక్కులు ఎంతో భరోసాను కల్పిస్తున్నాయని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు డీవీ ఫంక్షన్ హాల్ లో శనివారం అశ్వాపురం మండలానికి చెందిన 12 మంది బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం తీసుకునే పేద వారికి సైతం తిరిగి డబ్బులు అందించి వారికి చేయూతనివ్వలనే ఉద్దేశంతో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అశ్వాపురం మండలంలో 12 మంది దరఖాస్తు చేసుకున్న బాధితులకు సుమారు రూ,5 లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి,సర్పంచులు కోర్స క్రిష్ణ, తెల్లం నాగమణి,సరిత, మట్ల నర్సింహారావు,నాయకులు రమేష్ బాబు,వేముల విజయ్, లంకమల్ల కొండలరావు,భూరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మారుతి నర్సింగ్ విద్యార్థులకు కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగ నియామకాలు

**అక్షర కలం / భద్రాచలం**




భద్రాచలం పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో బిఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యాభై నాలుగు మందివిద్యార్థినులకు క్యాంపస్ సెలక్షన్ ద్వారా ప్రఖ్యాతి చెందిన కార్పొరేట్ హాస్పిటల్స్ ఉద్యోగ నియామకాలు చేపట్టినారు. వీరిలో పదమూడు మంది ప్రఖ్యాతి చెందిన కిమ్స్ హాస్పిటల్-సికింద్రాబాద్,ఇరవై ఆరు మంది ప్రతిమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ - కరీంనగర్ ఉద్యోగంలో చేరినారు. పదిహేను మంది ప్రాచి గ్లోబల్ హాస్పిటల్- హైదరాబాద్ నందు ఉద్యోగ నియామకాలు పొందినారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మేము మారుమూల గ్రామాల్లో చదివి అతిపేదకుటుంబాల నుండి వచ్చినామని,నేడు కార్పోరేట్ హాస్పిటల్స్ ఉద్యోగ అవకాశాలు కల్పించినకళాశాలయాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపినారు.

# భద్రగిరి మార్ట్ ను సందర్శించిన పొంగులేటి.శ్రీనివాస్ రెడ్డి,

**అక్షర కలం / భద్రాచలం**

భద్రాచలంపట్టణప్రజలకుఅడవులలో దొరికేఅటవీఉత్పత్తులు,సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులు,ఎస్ హెచ్ జి మరియు గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టుఅధికారిబి.రాహుల్, కృషితో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ చాలా అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా పిఓ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అన్నారు. శనివారం నాడు భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్ ను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్,మరియుఇతరఅధికారులతో కలిసి ఆయన సందర్శించి మార్ట్ లోనిఅటవీఉత్పత్తులనుపరిశీలించారు. ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని,ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎస్ హెచ్ జి గిరిజన మహిళలు మరియు ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, భద్రగిరి మార్ట్ లో అందుబాటులో ఉంచిన గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు,వారి ప్రతిభకు సరైన గుర్తింపుఇవ్వడం,అలాగేవా రిజీవనోపాధినిమెరుగ ుపరచడం లక్ష్యంగా ఈమార్ట్ఏర్పాటుచేయడంజరిగింద ని,భద్రాచలంప్రజలుగిరిజనఉత్పత్తులను కొనుగోలు చేసి,గిరిజన ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు,గిరిజనరైతులకు ఆర్థికంగా చేయూత అందించాలని ఆయన అన్నారు. అనంతరం భద్రగిరి మార్ట్ ఆవరణలో మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ మహామారి నిర్మూలనసంబంధించిన వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోభద్రాచలంశాసనసభ్యులు తెల్లం. వెంకట్రావు,జిల్లా కలెక్టర్.అ ంకిత్,ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్,మరియు ఐటీడీఏ యూనిట్ అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





**అక్షరకలం యాదాద్రి భువనగిరి**

ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం రాయగిరిలోని సోమా రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్ది, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని, జూన్ 2 నుండి పాఠశాలల్లో అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, ఆయిల్ ఫామ్ సాగుకు రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ?అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా బాబు రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మీ వెంటే మేమున్నాం.. మీ కష్టాలను తీరుస్తాం!

### బోదులబండ ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి అభయం





**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

నేలకొండపల్లి : "మీ కష్టాలను వినేందుకు, మీ కన్నీళ్లు తుడిచేందుకే ప్రభుత్వం మీ గడప వద్దకు వచ్చింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు మేము విశ్రమించం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన పాల్గొని, జనంతో నేరుగా మమేకమయ్యారు.



**అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు అతీతం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించే తమ ప్రభుత్వం 'ప్రజల వద్దకే పాలన'ను తీసుకువచ్చిందని చెప్పారు. "రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మే నెలాఖరులో రెండో దశ మంజూరు చేస్తాం. ప్రతి సోమవారం నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం" అని స్పష్టం చేశారు.

**భూ సమస్యలకు చరమగీతం**

భూ సమస్యల ద్వారా రైతులు పడుతున్న ఇబ్బందులను రాబోయే రెండు నెలల్లో పరిష్కరించి, రైతులకు మేలు చేకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర్‌తో కలిసి మంత్రి గంటల తరబడి ప్రజల మధ్యే ఉండి వందలాది మంది ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతి వారం దీనిపై సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతాం..

### సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాల కల్పన కోసమే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక..

### రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**ధర్మపురి మే 2 (అక్షర కలం)**

రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ధర్మపురి నియోజకవర్గస్థాయి సమావేశం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అడ్లూరి అన్నారు. ఇందులో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చని పథకాలను సైతం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా నియోజకవర్గా అభివృద్ధికి కృషి చేస్తున్నమని మంత్రి తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సుమారు 450 కోట్ల అంచనాలతో ధర్మపురిలో పుష్కర ఘాట్లు ఇతర మౌలిక సదుపాయాల కోసం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని మంత్రి తెలిపారు. తొలి విడత టైర్ వన్ ద్వారా రూ. 115 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో పాటు ధర్మపురికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయించామని మంత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ధర్మపురి నియోజకవర్గ విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అడ్మిషన్లు పొందాలని మంత్రి సూచించారు. గడిచిన రెండున్నర ఏళ్ల ప్రజా పాలనలో ధర్మపురి నియోజకవర్గంలోని 474 రైతులకు రైతు బీమా పథకం ద్వారా రూ. 18 కోట్ల 7లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతు భరోసా పథకంలో 1,21,851 మంది రైతులకు రూ 188 కోట్ల 48 లక్షలు అందజేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని 21, 917 మంది రైతులకు రూ.161 కోట్ల 82 లక్షల రుణమాఫీ చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన వ్యవసాయ యాంత్రీకరణను తిరిగి ప్రారంభించిన ప్రభుత్వం ధర్మపురి నియోజకవర్గాల్లోని 124 మంది రైతులకు 54 లక్షల 35 వేల విలువైన వ్యవసాయ యంత్రాలను అందజేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 3104 మంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేసి 139 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వివరించారు. గృహజ్యోతి పథకంలో 49వేల 444 మంది లబ్ధిదారులకు 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. చేయూత పెన్షన్ పథకం ధర 49 వేల 299 మంది లబ్ధిదారులకు 10 కోట్ల 97 లక్షల రూపాయలను జమ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి పథకంలో 2862 మందికి పదికోట్ల 91 లక్షలు రూపాయలు అందించినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో 15,835 మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నామని మంత్రి వివరించారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు పండించిన దాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో మక్కజొన్న రైతులకు మద్దతు ధర చెల్లించడానికి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ ఫైనల్ అయినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఎందుకు సంబంధించిన డ్రాయింగ్స్ పూర్తి కావడంతో త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ పనులను ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగవైకల్యాలు రాకుండా ఇప్పటికే పరీక్షలు నిర్వహించామని జగిత్యాల జిల్లాలో ఆర్బీ ఎస్కే ద్వారా చిన్నారులకు వైద్యం అందిస్తామని అందిస్తామని కలెక్టర్ తెలిపారు.






# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతాం..

### సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాల కల్పన కోసమే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక..

### రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**ధర్మపురి మే 2 (అక్షర కలం)**

రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ధర్మపురి నియోజకవర్గస్థాయి సమావేశం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అడ్లూరి అన్నారు. ఇందులో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చని పథకాలను సైతం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా నియోజకవర్గా అభివృద్ధికి కృషి చేస్తున్నమని మంత్రి తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సుమారు 450 కోట్ల అంచనాలతో ధర్మపురిలో పుష్కర ఘాట్లు ఇతర మౌలిక సదుపాయాల కోసం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని మంత్రి తెలిపారు. తొలి విడత టైర్ వన్ ద్వారా రూ. 115 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో పాటు ధర్మపురికి డిగ్రీ కాలేజ్ మంజూరు చేయించామని మంత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ధర్మపురి నియోజకవర్గ విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అడ్మిషన్లు పొందాలని మంత్రి సూచించారు. గడిచిన రెండున్నర ఏళ్ల ప్రజా పాలనలో ధర్మపురి నియోజకవర్గంలోని 474 రైతులకు రైతు బీమా పథకం ద్వారా రూ. 18 కోట్ల 7లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతు భరోసా పథకంలో 1,21,851 మంది రైతులకు రూ 188 కోట్ల 48 లక్షలు అందజేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని 21, 917 మంది రైతులకు రూ.161 కోట్ల 82 లక్షల రుణమాఫీ చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన వ్యవసాయ యాంత్రీకరణను తిరిగి ప్రారంభించిన ప్రభుత్వం ధర్మపురి నియోజకవర్గాల్లోని 124 మంది రైతులకు 54 లక్షల 35 వేల విలువైన వ్యవసాయ యంత్రాలను అందజేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 3104 మంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేసి 139 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వివరించారు. గృహజ్యోతి పథకంలో 49వేల 444 మంది లబ్ధిదారులకు 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. చేయూత పెన్షన్ పథకం ధర 49 వేల 299 మంది లబ్ధిదారులకు 10 కోట్ల 97 లక్షల రూపాయలను జమ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి పథకంలో 2862 మందికి పదికోట్ల 91 లక్షలు రూపాయలు అందించినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో 15,835 మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నామని మంత్రి వివరించారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు పండించిన దాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో మక్కజొన్న రైతులకు మద్దతు ధర చెల్లించడానికి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ ఫైనల్ అయినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఎందుకు సంబంధించిన డ్రాయింగ్స్ పూర్తి కావడంతో త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ పనులను ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగవైకల్యాలు రాకుండా ఇప్పటికే పరీక్షలు నిర్వహించామని జగిత్యాల జిల్లాలో ఆర్బీ ఎస్కే ద్వారా చిన్నారులకు వైద్యం అందిస్తామని అందిస్తామని కలెక్టర్ తెలిపారు.




# ప్రజాపాలన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం !

ప్రతి పేదవాడికి సొంత ఇల్లు నిర్మించాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యం ;



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,మే 02)

మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గం నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. లబ్ధిదారు ఇందిరమ్మ నూతన ఇందిరమ్మ ఇంటి రిబ్బన్ కటింగ్‌ను గ్రామ సర్పంచ్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చేశారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, ఫోన్ చెయ్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డిసిసి జనరల్ సెక్రటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బద్దిపల్లి రాజారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి. అశోక్ గౌడ్, గ్రామ వార్డు మెంబర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు:జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,మే 02)



పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి నారాయణపేట జిల్లా పరిధిలోని జిల్లా, రాష్ట్రాల సరిహద్దులో 06 చెక్ పోస్టులు, 01 అంతర్ జిల్లా చెక్ పోస్ట్ మొత్తం 07 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శ్రూా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 24ఇ7 నిరంతర పర్యవేక్షణలో వుండేవిధంగా జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్ ల వారిగా సమన్వయంతో పని చేస్తారని, పశువులను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు భద్రత చర్యలలో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఇప్పటికే 07 అవి: 1) జలాల్పూర్ చెక్పోస్ట్, 2) కాన్ కుర్తి చెక్ పోస్ట్, 3) చేగుంట చెక్పోస్ట్, 4) కృష్ణ బ్రిడ్జ్ చెక్ పోస్ట్, 5) ఉజ్జెల్లి చెక్పోస్ట్, 06) సమస్త పూర్ చెక్పోస్ట్, 07) లాల్కోట చెక్పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పదని అన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్టవిరుద్ధంగా ఆవులు,దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉండాలని స్పష్టం చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుండి రవాణా అయ్యే పశువుల విషయంలోనూ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు పండుగలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, మత సామరస్యంతో తమ పండుగలను జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

# ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన స్వరూప కాటం.

అక్షర కలం / ఇల్లెందు.



ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా కాటం స్వరూప శనివారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ బి. రవికుమార్ వద్ద నుండి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇల్లెందు మున్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేసిన కీర్తిక చంద్రికా రెడ్డి బదిలీ కావడంతో నూతనంగా ఇల్లందు మునిసిపల్ సివిల్ జడ్జిగా కాటం స్వరూప బాధ్యతలు చేపట్టారు. వారికి ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. రవికుమార్ నాయక్, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఇల్లందు మునిసిప్ సివిల్ జూనియర్ జడ్జ్ కాటం స్వరూప మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ పరస్పరం సహకారంతో కక్షిదారులకు న్యాయ సేవలు అందించాలని , ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. రవికుమార్ నాయక్, మరియు కార్యవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు తన సోదరులతో కలిసి స్వర్గస్తులైన తల్లిదండ్రులకు ఘన నివాళులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన చిన్నమ్మ, సోదరులు, కుటుంబ సభ్యులు,బంధువులతో కలిసి స్వర్గస్తులైన తల్లిదండ్రులు నారాయణ-వెంకటనర్సమ్మలకు ఘనంగా నివాళులర్పించారు.వద్దిరాజు కిషన్,వద్దిరాజు దేవేందర్,వద్దిరాజు రవిచంద్ర, వద్దిరాజు వెంకటేశ్వర్లు తమ మాతృమూర్తి వెంకటనర్సమ్మ 12వ వర్థంతి (తద్దినం,ఆబ్దికం) సందర్భంగా శనివారం స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో పూజ చేసి పిండ ప్రదానం చేశారు.ఆ తర్వాత వారు తల్లిదండ్రులు నారాయణ-వెంకటనర్సమ్మల జ్ఞాపకార్థం రూపొందించిన స్మృతి వనం సందర్శించి కుటుంబ సభ్యులు,బంధువులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు.నారాయణ-వెంకటనర్సమ్మ చిత్రపటాలకు వద్దిరాజు కమలమ్మ, కిషన్-శశిరేఖ, దేవేందర్ ఇందిర, రవిచంద్ర, వెంకటేశ్వర్లు-ఉమా మహేశ్వరి,మోహన్-వాసవి, వెంకటేశ్వర్లు, సంగిశెట్టి శంకర్, సంగిశెట్టి ప్రభాకర్, సంగిశెట్టి లక్ష్మీ నారాయణ, సంగిశెట్టి రాంమూర్తి-పద్మలు పూలదండలు వేసి,పూలుజల్లి,కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు.అలాగే,వద్దిరాజు శ్రీనివాస్,వద్దిరాజు నిఖిల్ చంద్ర,వద్దిరాజు నాగరాజు,వద్దిరాజు గిరినందన్,వద్దిరాజు శ్రీనివాస్ (గడ్డి) తదితరులు నారాయణ -వెంకటనర్సమ్మల చిత్రపటాలకు పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా వద్దిరాజు సోదరులు సుమారు 60 మంది బ్రాహ్మణులకు నిత్యావసరాలతో పాటు కొంత పారితోషికాన్ని అందజేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు.తమ మాతృమూర్తి వెంకటనర్సమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమారులు ఏర్పాటు చేసిన అన్నదానానికి సుమారు 600 మంది హాజరయ్యారు.

# సర్పంచులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి -- జాజుల శ్రీనివాస్ గౌడ్

అక్షరకలం వలిగొండ



స్థానిక సంస్థల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో పాటు గ్రామ సర్పంచులకు కూడా ఓటు హక్కు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ? తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాఘవాపురం (యాదాద్రి జిల్లా) సర్పంచ్ ఎరుకల యతీశ్వర గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.50,000లకు పెంచాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పంచాయతీ స్వీపర్ల కంటే సర్పంచుల వేతనం (రూ.6,500) తక్కువగా ఉండటం అన్యాయమని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన యతీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు కలిపి ఉన్న 'జాయింట్ చెక్ పవర్'ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార సమితి అధ్యక్షులు బత్తిని రాజు గౌడ్, మాజీ సర్పంచ్ ల సంఘం రాష్ట్ర సలహాదారులు ఘనగాని మల్లేష్, గొడుగు మహేష్ యాదవ్, తాటికొండ విక్రం, మహేష్ మేరు, ప్రవీణ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# నెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం:

– ధన్వాడలో యువకులకు గొప్ప అవకాశం



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,మే 02)

నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలం: వేసవి కాలంలో యువతను క్రీడల వైపు మళ్లించేందుకు నెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ధన్వాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సట్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరం జూన్ 7 వరకు కొనసాగనుంది. జిల్లా డి వై ఎస్ పి ఎస్. వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 50 మందకు పైగా యువకులు, విద్యార్థులు పాల్గొంటున్నారు. శనివారం శిబిరాన్ని ధన్వాడ గ్రామ సర్పంచ్ జ్యోతి రామచంద్రయ్య, హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ సందర్శించి, శిక్షణ పొందుతున్నవారిని ప్రోత్సహించారు. సర్పంచ్ జ్యోతి రామచంద్రయ్య మాట్లాడుతూ, "ఈ శిబిరం గ్రామంలోని యువకులకు అద్భుతమైన అవకాశం. నెట్‌బాల్ వంటి టీమ్ క్రీడలు శారీరక ఆరోగ్యం, టీమ్ వర్క్, క్రమశిక్షణను పెంచుతాయి. అందరూ సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు. హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ, "క్రీడలు యువతలో బిగి అలవాట్లకు దూరం చేస్తాయి. సట్ కి, డి వై ఎస్ పి వెంకటేష్‌కు ధన్యవాదాలు. ఇలాంటి కార్యక్రమాలు జిల్లా స్థాయిలో మరిన్ని జరగాలి" అని సూచించారు. శిక్షణలో కోచ్ డాక్టర్ రామ్మోహన్ గౌడ్, పీటీ రవికుమార్ గౌడ్ ప్రధానంగా పరిచాలకులుగా వ్యవహరిస్తున్నారు. వారు పురుషులు, మహిళల జట్లకు ప్రాక్టికల్ శిక్షణ, టెక్నిక్స్, ఫిట్‌నెస్ సెషన్లు ఇస్తున్నారు. శిబిరం ముగింపులో టోర్నీలు, సర్టిఫికెట్లు కూడా ఉంటాయని కోచ్ రామ్మోహన్ గౌడ్ తెలిపారు. ఈ శిబిరం ధన్వాడ, సమీప మండలాల్లోని యువతకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం కావడానికి సహాయపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నారాయణ పేటలో ఘనంగా పూలే అంబేద్కర్ 4వ జాతర భీమ్ ర్యాలీ

అంబేద్కర్ ఆశయాలు సాధించేందుకే జాతర కొనసాగించాలి

విశారదన్ మహరాజ్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి యు.మహేష్,చిన్నయ్య

(అక్షర కలం, నారాయణపేట జిల్లా,మే 02)

నారాయణ పేట జిల్లా కేంద్రంలో పూలే అంబేద్కర్ 4వ జాతర సందర్భంగా భారీ భీమ్ ర్యాలీని భారం భావి నుండి శీల గార్డెన్ వరకు జాతర కమిటీ నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల కోసం కలలు కన్నా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను నేటి యువత ఉనికిపించుకోవాలని ఆయన ఆశయ సాధన బాటలో నడవాలని పిలుపునిచ్చారు, అలాగే దేశంలో రాష్ట్రంలో పాలిస్తున్న పాలకులు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల హక్కులను కాల రాస్తున్నారని ఆయన అన్నారు , అంబేద్కర్ జాతర అంటే అన ఆశలను ఆయన కోరుకున్న సిద్ధాంతాలను ఉనికిపించుకోవాలని అలాంటి యువత నారాయణపేటలో ప్రతి సంవత్సరం అంబేద్కర్ జాతర నిర్వహించడం గొప్ప విషయమని జాతర నిర్వహిస్తున్న జాతర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,జాతర కమిటీ అధ్యక్షులు యు. మహేష్, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య,కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గత నేల నుండి జాతర నిర్వహణ కు జిల్లా లోని దామరగిద్ద,నారాయణపేట, మద్దూరు,కోస్గి,కొత్తపల్లి, ఉట్కూరు,ధన్వాడ,మక్తల్, మరికల్,మిగతా మండలలో గ్రామాలలో కమిటీలు వేసి జాతర నిర్వహణ కు నాయకులు కృషి చేశారు.పూలే,అంబేద్కర్ ఆశయాలు సాధన,రాజ్యాంగం రక్షణ కోసం జాతర ను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు.ప్రజానాట్యమండలి,కళాకారుల డప్పుల కార్యక్రమం ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ర్యాలీని ఘనంగా విజయవంతంగా నిర్వహించారు.



# భూసార ఆధారిత ఎరువుల వాడకంతోనే రైతులకు నికర లాభాలు

వ్యవసాయ వర్సిటీ ప్లానింగ్, మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ





(అక్షర కలం,

ప్రతి రైతు కచ్చితంగా తమ పొలంలో భూసార పరీక్ష నిర్వహించుకొని, దాని ఆధారంగా పంటల సాగు, ఎరువుల యాజమాన్యం తోనే నికర లాభాలు అందుతాయని హైదరాబాద్ లోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ అన్నారు. సంగారెడ్డి జిల్లా రాయ్ కోడ్ మండలం లోని శిరూర్ గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి పంటలో నాణ్యమైన అధిక దిగుబడులను సాధించాలంటే, అందుకు ఆ పొలంలో స్థూల, సూక్ష్మ పోషకాల లభ్యత, స్థాయి ఎంత ఉన్నాయో తెలుసుకోవాలని, మట్టి పరీక్ష ఆధారంగా, దానికి అనుగుణంగానే ఎరువులు వాడాలని ఆమె అన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న సేంద్రియ వనరులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమగ్ర పోషక యాజమాన్యం చేపడితే ఎరువులు, పురుగుమందులు వాడాల్సిన అవసరం తగ్గించుకోవచ్చని ఆమె అన్నారు.హైదరాబాదులోని రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ నుండి శాస్త్రవేత్తలు డా. ఎం. శాంతి, డా. అమరపల్లి గీత రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసేటప్పుడు నాణ్యమైన, అధిక దిగుబడి నాణ్యత సాధించేందుకు ఎరువుల వినియోగంలో మెలకువలు పాటించాలని కోరారు. అలాగే విచక్షణ రహితంగా ఎరువుల వాడకం, అధిక ఎరువులు వాడకంతో జరిగే అనర్ధాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఇస్మాయిల్ పటేల్ , మండల వ్యవసాయ విస్తరణ అధికారులు దీపిక, రైతులు అశోక్, సంగొండ, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు..టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..



అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్ లో నియోజకవర్గస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచితంగా మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ కలెక్షన్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డివో జ్యోతి, ఆర్డిఓ రాజేందర్, సంగారెడ్డి , సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ లు ,సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, శివాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు బ్రహ్మ హనుమాన్సిద్ధి మహా యజ్ఞం లో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి

హనుమాన్ దీక్ష పీఠాధిపతులు, హనుమాన్ మూల రూపకర్త శ్రీ శ్రీ శ్రీ దుర్గ ప్రసాద్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించిన

పూర్ణాహుతి యజ్ఞంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి



**అక్షర కలం సిద్దిపేట మే 02:**

పూర్ణాహుతి మహా యజ్ఞంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో హనుమాన్ మాల ధరించిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని, ఆంజనేయ స్వామివారి నామస్మరణతో ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. భక్తుల ఉత్సాహం, నమ్మకం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ మహా పూర్ణాహుతి యజ్ఞంలో పాల్గొనడం నా అదృష్టం అలాగే సిద్దిపేట నియోజవర్గ ప్రజలపై ఎల్లవేళలా స్వామివారి దీవెనలు కృపాకటాక్షాలు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన తెలిపారు."హనుమాన్ చాలీసా పారాయణం మనసుకు శాంతిని, జీవితానికి శక్తిని అందిస్తుంది. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి, సన్మార్గంలో నడిపిస్తాయి" అని అన్నారు. అలాగే పూర్ణాహుతి యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్దలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి -- సేవ -- సమాజ అభివృద్ధి అనే మూడు మార్గాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమం భక్తి మయంగా సాగుతుందన్నారు.

## మరికల్ మండలంలో 10వ తరగతి టాపర్లకు బీఆర్ఎస్ నాయకుల ఘన సన్మానం ;





**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,02)**

మరికల్, మే 2: మరికల్ మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎస్ , ఎస్,సి పరీక్షల్లో మండల స్థాయిలో అబ్బాయిల్లో సంతోష్, అమ్మాయిల్లో కృష్ణవేణి అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. వారిని సన్మానించిన నాయకులలో లంబాడి తిరుపతయ్య, వై.కృష్ణారెడ్డి, కోయిలకొండ రఘు, గూప నర్సిములు, పల్లెగడ్డ మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కుంటకొమ్ము మురళి, కృష్ణయ్య, జంగిడి రాము మొదలైనవారు ఉన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లంబాడి తిరుపతయ్య మాట్లాడుతూ, "మా మండలంలోని విద్యార్థులు ఇలా రాణిస్తుంటే అందరూ గర్వపడాలి. బీఆర్ఎస్ పార్టీ తద్దరగా విద్యా విభాగంలో మార్పులు తీసుకురావడమే కాకుండా, ప్రతిభలను ప్రోత్సహించడానికి ఎలాంటి కృషి అవసరమైనా చేస్తాం" అని అన్నారు. కృష్ణవేణి మాట్లాడుతూ, "పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించాను. భవిష్యత్తులో ఇంకా మెరుగ్గా చదువుకుంటాను" అంటూ ఆనందాన్ని వ్యక్తం చేసింది. సన్మానంలో శాలా బ్యాగులు, పుస్తకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేయబడ్డాయి. మండలంలో విద్యా మాయాజాలం వ్యాప్తి చెందాలని, ఇలాంటి కార్యక్రమాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా మారాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంతోష్ తల్లిదండ్రులు సహా అందరూ హాజరయ్యి విజయవంతం చేశారు.

## శిఖాంజనేయస్వామి వారికి అభిషేకం

మంగపేట, మే 2 ( అక్షర కలం ) : రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి చెందిన ములుగు జిల్లా మంగపేట మండలంలోని శ్రీ హేమాచల(మల్లూరు) లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఆలయ సమీపంలోని శిఖాంజనేయస్వామి వారికి స్నపనం ( అభిషేకం ) కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజైన శనివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు, శ్రీ హేమాచల ( మల్లూరు ) లక్ష్మీ నృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వాహక పూజారులు అమరవాది మురళీ కృష్ణమాచార్యులు, వారి బృందం, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహా స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర



శర్మ, అర్చకులు కారంపూడి పవనకుమారాచార్యులు, యేడునూతల ఈశ్వర చందు శర్మ, ముక్కామల వేంకట నారాయణ శర్మ ( బాబీ ), అనిపెద్ది రాజీవ్ నాగ శర్మ తదితరుల ఆధ్వర్యంలో శనివారం 10 గంటలకు శిఖాంజనేయస్వామి వారికి పంచామృతాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంక్షిప్త రామాయణహవనం, చతుస్థానార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎం.వీరాస్వామి, దేవాదాయ శాఖ పరిశీలకులు, కురవి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రావణపు సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ యర్రంగారి సురేష్, ఉత్సవ కమిటీ సభ్యురాలు పాయం అనిత , ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతకు... అన్నదానలకు పెట్టింది పేరు.. మన సిద్దిపేట

### హనుమాన్ దీక్ష కు... బిక్షకు బీజం వేసింది మన సిద్దిపేటనే

### పట్టణంలో విలీనం అయ్యాక సమగ్ర అభివృద్ధి సాధించింది రంగదాంపల్లి

### రంగధాంపల్లి శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయ అన్న ప్రసాద భవనం ను ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**అక్షర కలం సిద్దిపేట మే 02:**

సిద్దిపేట పట్టణం 3 వార్డ్ రంగదాంపల్లి లో శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయం ప్రాంగణం లో నిర్మించిన అన్న ప్రసాద భవనం ను ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతు. సిద్దిపేట అన్నదానాలకు పెట్టింది పేరన్నారు. ఆధ్యాత్మికతకు



అన్నదానలకు నెలవు గా మారిందన్నారు. హనుమాన్ దీక్ష బిక్ష కు బీజం వేసింది మన సిద్దిపేటనేన్నారు. రావి చెట్టు హనుమాన్ దేవాలయం లో 41రోజులు, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం లో 21రోజులు, పంచముఖ హనుమాన్ దేవాలయం లో 21 రోజులు బిక్ష కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రావి చెట్టు హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం, నేడు రంగాధంపల్లి లో ప్రారంభం చేసుకున్న ం. సిద్దిపేట లో చేసిన అన్ని భవనాలకు నా సహకారం అందించానని చెప్పారు. హనుమాన్ దీక్ష సమయం లో వేలాది మంది స్వాములు దీక్ష లో పాల్గొంటారని వారికి బిక్ష ఎంతో ఈ అన్నదాన భవనం లు ఉపయోగ పడుతున్నాయన్నారు. ఎన్నో కార్యక్రమాలకు సిద్దిపేట నెలవు గా మారిందన్నారు. మట్టి వినాయకుల పంపిణి మొట్టమొదలు మనసిద్దిపేట లోనే ప్రారంభం చేసుకున్నామన్నారు. రంగదాంపల్లి గ్రామంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకొని ఆదర్శం గా నిలుపుకున్నామని చెప్పారు.. అన్నదాన భవనం కు సహకరించిన దాతలను ఈ సందర్భంగా సత్కరించారు.

# డ్రగ్స్ నిరోధకం విషయంలో ఈగల్ టీమ్ తన బాధ్యత విజయవంతం గా నిర్వహిస్తుంది....

### నేటి యువత దేశానికి వెన్నెముక

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల మే 2 (అక్షర కలం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణ విరుపాక్షి గార్డెన్స్ లో జగిత్యాల నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొన్న జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రత , హెల్త్, విద్య, వ్యవసాయం, యువత క్రీడలు, విద్యుత్, పిల్లల భద్రత ,తదితర రంగాల్లో జరిగిన అభివృద్ధి పనుల కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని. జగిత్యాల మున్సిపల్ రాయికల్ మున్సిపల్ వార్డు అధికారులు హాజరు శాతం లేకపోవడం పట్ల ఉన్నత అధికారులు బాధ్యత వహించాలని అన్నారు.ఇప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజలకు సేవా చేయాలని ఆలోచనతో



పని చేయాలి నేను విస్తృతంగా సేవ చేయాలని రాజకీయాల్లోకి రావడం జరిగింది.నా సేవలు మెచ్చి జగిత్యాల ప్రజలు నన్ను గెలిపించారు. అధికారులు కూడా ప్రజల మనసు గెలుచుకోవాలి. ప్రజలు అధికారుల్ని వారు చేసిన సేవల్ని గుర్తుంచుకోవాలి.అధికారులు నిజాయితీతో చిత్తశుద్ధి తో పని చేయాలి..రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత మేర ఇబ్బందిగా ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు వారికి మద్దతుగా ఉండి పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

డ్రగ్స్ నిరోధకం విషయంలో ఈగల్ టీమ్ తన బాధ్యత విజయవంతం గా నిర్వహిస్తుంది.నేటి యువత దేశానికి వెన్నెముక అని అన్నారు.వైకుంఠ ధామాలు,పల్లె ప్రకృతి పార్కుల పరిశుభ్రత గ్రామాల్లో పచ్చదనం పైసర్పంచులు, కార్యదర్శులు దృష్టి పెట్టాలని కోరారు జగిత్యాల నియోజకవర్గం లో 78 వేల కుటుంబాలకు ఉచిత కరెంట్ అందుతుంది.సన్న బియ్యం,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగింది.రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు మంచి కార్యక్రమం ఇట్టి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి,వ్యవసాయ అధికారులు ఎంపీడీవో ల సహకారం తో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమ షెడ్యూల్ ను తెలపాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్, ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి, ఏ.యం.సి చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, జిల్లా,మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు,సర్పంచులు కౌన్సిలర్ లు ఉప సర్పంచ్ లు మహిళ సమాఖ్య సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు.

# పొరుగు జిల్లాలోని ప్రాజెక్టుకు ములుగు జిల్లాకు ఏం సంబంధం ?

### డీ సిల్టేషన్ కోసం నిర్వహించే గ్రామ సభలను నిలిపి వేయాలి

### బీఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్

**మంగపేట, మే 2 ( అక్షర కలం )**

: ములుగు జిల్లా మంగపేట తహశీల్ పరిధిలోని అకినేపల్లి మల్లారం, రమణక్కపేట, వాడగూడెం గ్రామాలలో డీ సిల్టేషన్ కోసం ఈ నెల 4 వ తేది( సోమవారం )న నిర్వహించనున్న గ్రామ సభలను నిలిపివేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఎంపిటిసిలు కుడుముల లక్ష్మినారాయణ, కొమరం రామ్మూర్తి లు శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ములుగు జిల్లా మంగపేట మండలం కత్తిగూడెం గ్రామంలో గోదావరి నది వద్ద బ్రాహ్మణపల్లి వద్ద శివగంగ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేశారని, ఆ ఎత్తిపోతల పతక ద్వారా గిరిజన, గిరిజనేతర రైతులకు వ్యవసాయ సాగు భూములకు నీరు అందించేదని, ఆ ప్రాంతంలో గోదావరి నదిలోని బావి చుట్టూ ఉన్న ఇసుక మేట తొలగించుటకు సంబంధిత ప్రభుత్వ శాఖల సర్వే రిపోర్టులు ఉన్నా



అక్కడ డీ సిల్టేషన్ కోసం గ్రామ సభ తేదీలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. కాని మంగపేట మండలంలోని అకినేపల్లి మల్లారం, రమణక్కపేట, వాడగూడెం గ్రామాలలో ఎలాంటి ప్రాజెక్టులు లేనప్పటికి డీ సిల్టేషన్ కోసం గ్రామ సభలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని వారు ఆ ప్రకటనలో ప్రశ్నించారు. బ్రాహ్మణపల్లిలోని శివగంగ ఎత్తిపోతల పథకం గోదావరి నదిలోని బావి చుట్టూ ఉన్న ఇసుక మేటలు తొలగించక పోవడంతో 2012 నుండి గత పద్నాలుగు సంవత్సరాల నుండి గిరిజన, గిరిజనేతర రైతులకు చెందిన 16 వందల ఎకరాలకు వ్యవసాయ సాగు భూములకు నీరు అందడం లేదన్నారు. బ్రాహ్మణపల్లిలోని శివగంగ ఎత్తిపోతల పథకం డీ సిల్టేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ , ప్రిన్సిపుల్ సెక్రటరీ టూ గవర్నమెంట్ (మైన్స్) మేమో నెం:2004/వీ.×1 (1) / 2022 ప్రకారం తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని, జిల్లా కలెక్టర్ 9 సార్లు జిల్లా స్థాయి సాండ్ కమిటి ( డీఎల్ఎస్సీ ) లో ఆమోదించి ప్రభుత్వానికి పంపగా ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చినా గ్రామ సభ ఏర్పాటు చేయలేదన్నారు. శివగంగ ఎత్తిపోతల పథకం పరిధిలో 15 వందల గిరిజన కుటుంబాలు ఉన్నాయని, వ్యవసాయ సాగు నీరు కొరకు ఇసుక మేటలను తొలిగించాలని కోరినా గత జిల్లా కలెక్టర్ అర్థం చేసుకుని కూడా సహాయం చేయలేదని వారు ఆరోపించారు. మంగపేట మండలం వాడగూడెం, రమణక్కపేట, అకినేపల్లి మల్లారం ఈ మూడు గ్రామాల వద్ద ఎప్పుడు ప్రాజెక్టులు కట్టారని, ఏ జీఓ ద్వారా ప్రాజెక్టులు నిర్మాణం చేశారని ప్రశ్నించారు. అసలు ఎ లాంటి ప్రాజెక్టులు లేని ప్రాంతంలో గోదావరి నదిలో డీ సిల్టేషన్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం దేవరపల్లి గ్రామం అశ్వాపురం మండలం అయ్యగారిపల్లి గ్రామం మధ్య ఉన్న సీతమ్మ సాగర్ మల్టీ పర్పస్ ప్రాజెక్ట్ మంగపేట మండలానికి సుమారు 70 కిలిమీటర్ల దూరం ఉంటుందని, ఆ ప్రాజెక్టు పేరుతో ములుగు జిల్లాలో డీ సిల్టేషన్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల అభివృద్ధి కోసం ప్రముఖ జిల్లా నాయకుడు, ప్రభుత్వ పెద్దలు సహకారంతో బినామీ కాంట్రాక్టర్లు వారి అభివృద్ధి కోసం డీ సిల్టేషన్ ప్రాజెక్టును తీసుకువచ్చారని వారు ఆరోపించారు. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయని, రైతుల వ్యవసాయ బోరు లెవల్ పూర్తి స్థాయికి పడిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ నెల 4 వ తేది( సోమవారం )న నిర్వహించనున్న గ్రామ సభలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సభలు నిలిపి వేయని ఎడల లేని యెడల ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఎంపిటిసిలు కుడుముల లక్ష్మినారాయణ, కొమరం రామ్మూర్తిలు ఆ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

# ప్రజలు ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు పాటించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే 02)**

నారాయణపేట: జిల్లా ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇటీవల అధిక ఎండల కారణంగా ఒక ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతి అయిన సంఘటనను ప్రస్తావిస్తూ, వాహనాలను నేరుగా ఎండలో పార్క్ చేయకుండా



చెట్ల నీడలో లేదా షెడ్లలో ఉంచాలని సూచించారు. వాహనాల్లో ఇంధనం, బ్యాటరీలు వంటి భాగాలు అధిక వేడికి గురై ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రజలు ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, చల్లని నీరు తరచుగా తాగడం, ఎలక్ట్రోలైట్ పానీయాలు సేవించడం ద్వారా డీహైడ్రేషన్ నుంచి రక్షించుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండల వల్ల అలసట, తలనొప్పి, తల తిరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955